తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice
వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

02-08-2026

ఆదివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 175

PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక సిరి People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575


## తలసరి ఆదాయంలో గణనీయ వృద్ధి.. తెలంగాణ అభివృద్ధి జోరు: సీఎం

- పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో రాష్ట్ర ప్రగతి
- 2025-26లో తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరిందని వెల్లడి
- ఏడాదిలోనే 10.23 శాతం వృద్ధి నమోదు
- సుపరిపాలన, ఆర్థిక క్రమశిక్షణతో విజయమన్న రేవంత్



హైదరాబాద్, ఆగస్టు 1, సిరి న్యూస్

కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణ అభివృద్ధి మరింత వేగం అందుకుందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. సరైన విధానాలు, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల కల్పనతో రాష్ట్రం దేశంలోనే వేగంగా అభివృద్ధి

మిగతా 2వ పేజీలో..

## హైడ్రా పనితీరుపై సీఎం ప్రశంసలు..

- చెరువుల పునరుద్ధరణకపై అభినందనలు
- ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవనంపై సంతృప్తి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి
- హైడ్రా అధికారులు, సిబ్బంది సేవలను కొనియాడిన రేవంత్ రెడ్డి

2



2

## పప్పు, పామాయిల్ సాగుపై దృష్టి పెట్టాలి: గవర్నర్

- హార్టికల్చర్ అభివృద్ధి చర్యలను ప్రశంసించిన శివ ప్రతాప్ శుక్ల




# కేబినెట్ విస్తరణకు బ్రేక్

- ఢిల్లీ చర్చల తర్వాత మంత్రి పదవులపై హైకమాండ్ నిరీక్షణ.. ఆశావహులకు నిరాశ
- తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ప్రస్తుతానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వని కాంగ్రెస్ అధిష్ఠానం
- ఢిల్లీలో మూడు రోజుల చర్చల అనంతరం పాలనపైనే దృష్టి పెట్టాలని నేతలకు సూచన
- ఖాళీ బెర్తుల భర్తీ చేస్తే అసంతృప్తి పెరిగే అవకాశం ఉందనే అంచనా
- సీనియర్లు, యువ ఎమ్మెల్యేల మధ్య మంత్రి పదవుల పోటీతో క్లిష్టమైన సమీకరణాలు
- ప్రతి 45 రోజులకు సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆదేశం
- స్థానిక సంస్థలు, ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలపై దృష్టి పెట్టాలని హైకమాండ్ సూచన

హైదరాబాద్, ఆగస్టు 1, సిరి న్యూస్:

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ విస్తరణపై నెలకొన్న ఉత్కంఠకు ప్రస్తుతానికి తెరపడినట్లైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్రానికి చెందిన ముఖ్య నాయకులు ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానంతో నిర్వహించిన వరుస సమావేశాల్లో కేబినెట్ విస్తరణ అంశం చర్చకు వచ్చినప్పటికీ, ఈ దశలో ఎలాంటి మార్పులు చేపట్టవద్దని పార్టీ పెద్దలు నిర్ణయించినట్లు సమాచారం. దీంతో మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్న పలువురు ఎమ్మెల్యేలకు నిరాశ ఎదురైంది.

**అసంతృప్తికి అవకాశం ఇవ్వొద్దన్న నిర్ణయం**

ప్రస్తుతం ఖాళీగా ఉన్న మంత్రి పదవులను భర్తీ చేయడం లేదా శాఖల మార్పులు చేపట్టడం వల్ల పార్టీలో కొత్త అసంతృప్తికి తావిచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఇతర రాష్ట్రాల్లో ఎదురైన

మిగతా 2వ పేజీలో..




## క్రిమినల్ వేస్ట్ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో దుమారం

- ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలంటూ ప్రతిపక్షాల డిమాండ్
- జెన్-జీ అసంతృప్తిని ఉద్యమంగా మలిచే ప్రయత్నాలు
- సామాజిక మాధ్యమాల్లో హ్యాష్‌ట్యాగ్‌లు, మీమ్‌లతో ప్రతిస్పందన
- విద్యా సంస్కరణల కోసమే వ్యాఖ్యలు చేశామని కాంగ్రెస్ వివరణ

2



## జెన్‌జీ ఉద్యమంతో దిగొచ్చిన కేంద్రం: కేటీఆర్

- ఢిల్లీ ఉద్యమం కేంద్రాన్ని స్పందించేలా చేసిందని వ్యాఖ్య
- యువత శక్తిని తక్కువ అంచనా వేయొద్దని సూచన
- సోషల్ మీడియానే మార్పుకు ప్రధాన వేదిక అని అభిప్రాయం
- సీఎం రేవంత్ వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ స్పందించాలని డిమాండ్

2

## జూలైలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం!

- వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర సరఫరా అందించిన టీజీఎస్పీడీసీఎల్
- ముందస్తు కార్యాచరణతో విజయవంతమైన విద్యుత్ పంపిణీ
- నెట్‌వర్క్ ఆధునీకరణ, సబ్‌స్టేషన్ల సామర్థ్య పెంపే కారణమన్న సీఎండీ

తెలంగాణ బ్యూరో (సిరి న్యూస్):

తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఎలాంటి అంతరాయాలు లేకుండా నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరాను అందించేందుకు తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) అత్యంత

మిగతా 3వ పేజీలో..



## ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలకు పటిష్ట విద్యుత్ ఏర్పాట్లు

- పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్
- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన సీఎండీ

3

## ఇకపై వారానికి రెండు రోజులు ప్రజాబాట..

- ఉత్తర్వులు జారీ చేసిన టీజీఎస్పీడీసీఎల్
- ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా యంత్రాంగం
- గతంలో మంగళవారం మాత్రమే కార్యక్రమం
- శుక్రవారాన్ని కూడా జోడించిన ఆపరేషన్ సీజీఎం
- వర్షాకాలంలో విద్యుత్ భద్రతపై అవగాహన
- క్షేత్రస్థాయి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశం

3

## ప్రాణదాతగా హైదరాబాద్ మెట్రో..

- 25 నిమిషాల్లో అవయవాల తరలింపు
- గ్రీన్ ఛానెల్‌తో గుండె, ఊపిరితిత్తుల అత్యవసర రవాణా
- గచ్చిబౌలి నుంచి సికింద్రాబాద్‌కు వేగంగా చేరిన అవయవాలు
- 14 కిలోమీటర్ల ప్రయాణం కేవలం 25 నిమిషాల్లో పూర్తి
- అత్యవసర వైద్య సేవలకు పూర్తి సహకారం అందిస్తామని మెట్రో అధికారులు వెల్లడి

హైదరాబాద్, సిరి న్యూస్

అత్యవసర అవయవ మార్పిడి కోసం హైదరాబాద్ మెట్రో మరోసారి ప్రాణదాతగా నిలిచింది. గచ్చిబౌలిలోని ఆసుపత్రి నుంచి సికింద్రాబాద్‌లోని మరో ఆసుపత్రికి గుండె, ఊపిరితిత్తులను ప్రత్యేక గ్రీన్ ఛానెల్ ద్వారా కేవలం 25 నిమిషాల్లో సురక్షితంగా





## తెలంగాణ రైతాంగం జీవనాడి ఎస్సారెస్పీ: ఉత్తమ్ కుమార్ రెడ్డి

- ఎస్సారెస్పీ పూడికతీతకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం
- రెండు రోజుల్లో సాగునీటి విడుదలపై నిర్ణయం
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శ
- రైతులకు సాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ

నిజామాబాద్, ఆగస్టు 1, సిరి న్యూస్

శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ) ప్రాజెక్టు తెలంగాణ రైతాంగానికి జీవనాడిగా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ఎస్సారెస్పీ ప్రాజెక్టును సందర్శించి జలాశయ పరిస్థితిని పరిశీలించిన ఆయన, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని

మిగతా 3వ పేజీలో..

## ఉత్తర తెలంగాణ రైతులకు సాగునీరే లక్ష్యం: ఉత్తమ్

- గోదావరి జలాల వినియోగంపై సమగ్ర అధ్యయనం చేస్తున్న ప్రభుత్వం
- ఎల్లంపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించిన మంత్రుల బృందం
- కాళేశ్వరం బ్యారేజీలపై మంత్రుల విమర్శలు

3

## అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలకు చెక్..

- స్పీకర్ ఛాంబర్‌లో కమిటీ కీలక భేటీ
- విద్వేష ప్రసంగాల నియంత్రణ బిల్లుపై విస్తృత చర్చ
- వర్షాకాల సమావేశాల ముగిసేలోపు నివేదిక సమర్పణకు కసరత్తు
- భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగకుండా చట్టం: పొన్నం



హైదరాబాద్, ఆగస్టు 1, సిరి న్యూస్

శాసనసభలో విద్వేషపూరిత, రెచ్చగొట్టే వ్యాఖ్యలను నియంత్రించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకురానున్న చట్టానికి సంబంధించి కసరత్తు ముమ్మరమైంది. ఈ నేపథ్యంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో సెలెక్ట్ కమిటీ చైర్మన్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించారు. సమావేశానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు హాజరై బిల్లుకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. విద్వేష ప్రసంగాల

మిగతా 2వ పేజీలో..

# తలసరి ఆదాయంలో గణనీయ వృద్ధి.. తెలంగాణ అభివృద్ధి జోరు: సీఎం

**మొదటిపేజీ తరువాయి**

చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు. 202526 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే ఒక్కో వ్యక్తి ఆదాయం రూ.38,900 పెరిగిందని, ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు కావడం రాష్ట్ర ఆర్థిక బలోపేతానికి నిదర్శనమని చెప్పారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ సమర్థవంతమైన ప్రణాళికలు అమలు చేయడం, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతమైందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలన, ఆర్థిక క్రమశిక్షణతో అభివృద్ధి ఫలితాలను ప్రజలకు చేరవేస్తున్నామని తెలిపారు. గతంలో ఉన్న పరిపాలనా లోపాలను అధిగమించి ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించగలిగామని ముఖ్యమంత్రి అన్నారు. ఇదే అభివృద్ధి వేగాన్ని కొనసాగిస్తూ తెలంగాణను అన్ని రంగాల్లో మరింత ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు.

# కేబినెట్ విస్తరణకు బ్రేక్

**మొదటిపేజీ తరువాయి**

అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణలో ప్రభుత్వం స్థిరంగా పనిచేసేలా చూడటమే ప్రస్తుతం ప్రాధాన్యమని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**క్లిష్టమైన సామాజిక సమీకరణాలు**

మంత్రి పదవుల కోసం పలువురు సీనియర్ ఎమ్మెల్యేలతో పాటు యువ నాయకులు కూడా పోటీలో ఉండటంతో సమీకరణాలు మరింత సంక్లిష్టంగా మారినట్లు తెలుస్తోంది. ప్రాంతీయ, సామాజిక, రాజకీయ సమతుల్యతను ఒకేసారి సాధించడం సవాల్‌గా మారడంతో, విస్తరణ నిర్ణయాన్ని వాయిదా వేయడమే ఉత్తమ మార్గమని అధిష్ఠానం భావించినట్లు సమాచారం.

**పాలనపైనే ప్రధాన దృష్టి**

ఢిల్లీ సమావేశాల్లో ప్రభుత్వ పనితీరు, సంక్షేమ కార్యక్రమాల అమలు, పార్టీ-ప్రభుత్వ సమన్వయంపై ప్రత్యేకంగా చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రతి 45 రోజులకు ఒకసారి సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించాలని, ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంపై దృష్టి సారించాలని నాయకత్వానికి సూచించినట్లు సమాచారం. అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, ఓటర్ల నమోదు ప్రక్రియపై పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.

**ఆశావహులకు స్పష్టమైన సంకేతం**

మంత్రి పదవుల కోసం ఎదురుచూస్తున్న నేతలకు ప్రస్తుతం నిరీక్షణ తప్ప మరో మార్గం లేదనే సంకేతాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం ఇచ్చినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రభుత్వం పనితీరును బలోపేతం చేయడం, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్ఠం చేయడంపైనే దృష్టి పెట్టాలని స్పష్టం చేయడంతో, తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ విస్తరణ అంశం మరోసారి వాయిదా పడినట్లుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలకు చెక్..

**మొదటిపేజీ తరువాయి**

నియంత్రణతో పాటు ప్రతిపాదిత క్రైమ్ బిల్లులో పొందుపరచాల్సిన నిబంధనలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు.
శాసనసభలో సభ్యులు భావప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకునే హక్కును కాపాడుతూనే, వ్యక్తిగత దూషణలు, విద్వేషాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలను నిరోధించేలా చట్టానికి రూపకల్పన చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
శాసనసభ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు బిల్లుకు సంబంధించిన పూర్తి నివేదికను సభకు సమర్పించాలని కమిటీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందుకోసం వచ్చే వారం మరోసారి సమావేశమై ముసాయిదాపై తుది చర్చలు జరపనున్నట్లు తెలిపారు.
వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, న్యాయ నిపుణులు, సామాజిక వేత్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని బిల్లుకు తుది రూపు ఇవ్వనున్నట్లు పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఈ చట్టం ప్రజాప్రతినిధుల భావప్రకటనా స్వేచ్ఛను పరిమితం చేయడానికి కాదని, శాసనసభ గౌరవాన్ని కాపాడుతూ వ్యక్తుల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా చూడడమే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

# కామన్వెల్త్ స్వర్ణ విజేతలకు సీఎం అభినందనలు

- **జాస్మిన్, ప్రీతి విజయాలు దేశానికి గర్వకారణమన్న రేవంత్**
- **యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్ష**
- **అంతర్జాతీయ వేదికపై మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు**
- **క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ**

**హైదరాబాద్, ఆగస్టు 1, సిరి న్యూస్**

గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణ పతకాలు సాధించిన భారత మహిళా బాక్సర్లు జాస్మిన్ లాంబోరియా, ప్రీతి పవార్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అభినందించారు. అంతర్జాతీయ వేదికపై భారత కీర్తిని చాటిన వారి ప్రదర్శన దేశానికి గర్వకారణమని కొనియాడారు. మహిళల 57 కిలోల విభాగంలో జాస్మిన్ లాంబోరియా, 54 కిలోల విభాగంలో ప్రీతి పవార్ స్వర్ణ పతకాలు గెలుచుకోవడం భారత బాక్సింగ్‌కు మరో గొప్ప విజయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భారత జెండాను ప్రపంచ వేదికపై రెపరెపలాడించిన ఈ ఇద్దరు క్రీడాకారిణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.
జాస్మిన్, ప్రీతి ప్రదర్శించిన కృషి, పట్టుదల, అంకితభావం యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తాయని రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి విజయాలు భావితరాల్లో క్రీడలపై ఆసక్తిని పెంచడంతో పాటు మరింత ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ అంతర్జాతీయ పోటీల్లో ఇదే జోరు కొనసాగించి మరిన్ని పతకాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించడంలో తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భారత క్రీడాకారులు ప్రపంచ వేదికపై మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



# హైడ్రా పనితీరుపై సీఎం ప్రశంసలు..

**హైదరాబాద్, ఆగస్టు 1, సిరి న్యూస్**

హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, జలవనరుల పునరుద్ధరణలో హైడ్రా చేపడుతున్న చర్యలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రశంసించారు. చెరువుల పునరుజ్జీవనంతో నగరం కొత్త రూపును సంతరించుకుంటోందని, ఈ మార్పు తనకు ఎంతో సంతృప్తిని కలిగిస్తోందని ఆయన సామాజిక మాధ్యమం ద్వారా పేర్కొన్నారు. ఉప్పల్ నల్ల చెరువు పునరుద్ధరణ కోసం శ్రమించిన హైడ్రా అధికారులు, సిబ్బందిని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఆక్రమణలు, వ్యర్థాలతో దెబ్బతిన్న చెరువులను ప్రణాళికాబద్ధంగా శుభ్రపరచి మళ్లీ జీవం పోస్తుండటం అభినందనీయమని చెప్పారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాలకు మెరుగైన సహజ వనరులను అందించడంలో హైడ్రా కీలక బాధ్యత నిర్వహిస్తోందని కొనియాడారు.
చెరువుల సంరక్షణ అనేది కేవలం నీటి వనరులను కాపాడడం మాత్రమే కాదని, భవిష్యత్ తరాలకు భద్రమైన జీవన వాతావరణాన్ని అందించడమేనని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నగరంలోని ఆక్రమణలకు గురైన చెరువులను పరిరక్షించడంతో పాటు ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.
హైడ్రా చేపడుతున్న చర్యలు హైదరాబాద్‌కు పర్యావరణపరంగా, అభివృద్ధి పరంగా కొత్త గుర్తింపును తీసుకొస్తున్నాయని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాలను ఇదే వేగంతో కొనసాగించి నగర జలవనరులను పరిరక్షించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు.

# క్రిమినల్ వేస్ట్ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో దుమారం

**హైదరాబాద్, ఆగస్టు 1, సిరి న్యూస్**

తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ల ఉద్యోగార్హతలు, నైపుణ్యాలపై చేసిన "క్రిమినల్ వేస్ట్" వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రతి ఏడాది లక్షకు పైగా ఇంజినీరింగ్ పట్టభద్రులు బయటకు వస్తున్నప్పటికీ ఉద్యోగాలకు అవసరమైన కనీస నైపుణ్యాలు కూడా చాలామందిలో కనిపించడం లేదని వ్యాఖ్యానించిన సీఎం మాటలను ప్రతిపక్షాలు యువతను అవమానించేలా ఉన్నాయని విమర్శిస్తున్నాయి. దీంతో ఈ అంశం రాజకీయంగా వేడెక్కింది.
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి ముఖ్యమంత్రి విద్యార్థులు, ఉపాధ్యాయులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించిన వారు, జెన్‌జీ విద్యార్థులు ఈ వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. బీజేపీ నేత ఈటల రాజేందర్ కూడా సీఎం వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ వివరణ ఇవ్వాలని కోరారు.
ఈ వివాదం సామాజిక మాధ్యమాల్లో మరింత వేగంగా విస్తరిస్తోంది. "మేము క్రిమినల్ వేస్ట్ కాము", "నవ తెలంగాణ నిర్మాతలం" వంటి హ్యాష్‌ట్యాగ్‌లతో పోస్టులు, మీమ్‌లు, షార్ట్ వీడియోలు విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. వివాదాస్పద పదాలను నిరసన చిహ్నాలుగా మలిచే డిజిటల్ ధోరణిని ప్రతిపక్షాలు రాజకీయంగా వినియోగించుకునే ప్రయత్నం చేస్తున్నాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. యువతలో అసంతృప్తిని మరింత బలంగా ప్రతిబింబించేలా ఆన్‌లైన్ ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయి. మరోవైపు, ముఖ్యమంత్రి వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు సమర్థిస్తున్నారు. విద్యార్థులను అవమానించడం తమ ఉద్దేశం కాదని, నైపుణ్యాల కొరతతో ఉన్న విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరాన్ని మాత్రమే సీఎం ప్రస్తావించారని చెబుతున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యా విధానంలో సంస్కరణలు తీసుకొచ్చి ప్రాక్టికల్ శిక్షణ, విదేశీ భాషలు, అప్రెంటిస్‌షిప్‌కు ప్రాధాన్యం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరిస్తున్నారు.
విద్యా వ్యవస్థలోని లోపాలను ప్రస్తావించే క్రమంలో ఉపయోగించిన పదజాలమే ఇప్పుడు రాజకీయ వివాదానికి కేంద్రబిందువైంది. ఒకవైపు ప్రతిపక్షాలు దీనిని యువత ఆత్మగౌరవ సమస్యగా ప్రచారం చేస్తుండగా, మరోవైపు ప్రభుత్వం ఇది విద్యా సంస్కరణలపై జరిగిన చర్చ మాత్రమేనని స్పష్టం చేస్తోంది. ఈ వివాదం రాజకీయంగా ఎంత వరకు ప్రభావం చూపుతుందనేది రానున్న రోజుల్లో తేలనుంది.



# జెన్‌జీ ఉద్యమంతో దిగొచ్చిన కేంద్రం: కేటీఆర్

**హైదరాబాద్, ఆగస్టు 1, సిరి న్యూస్**

జెన్‌జీ యువత చేపట్టిన ఉద్యమం ప్రభావంతో కేంద్ర ప్రభుత్వం స్పందించాల్సి వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. దేశ యువత శక్తిని ఎవరూ తక్కువ అంచనా వేయొద్దని, ఢిల్లీలో జరిగిన ఉద్యమం రాజకీయ వర్గాలకు కొత్త సందేశాన్ని ఇచ్చిందన్నారు. ఓ తెలుగు దినపత్రిక వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.
జెన్‌జీ యువత ఢిల్లీలో చేపట్టిన ఆందోళనల దెబ్బకు ప్రధాని నరేంద్ర మోదీ అర్ధరాత్రి వీడియో విడుదల చేయాల్సి వచ్చిందని కేటీఆర్ అన్నారు. యువతతో తలపడటం ఎవరికీ మంచిది కాదని, వారు ఒకసారి ఉద్యమ బాట పట్టితే ప్రభుత్వాలనే కదిలించే శక్తి ఉందని పేర్కొన్నారు. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలకు భయపడే తరం జెన్‌జీ కాదని వ్యాఖ్యానించారు.
దేశ యువతలో దేశభక్తి, బాధ్యతా భావం లేదనే అభిప్రాయం తప్పని ఇటీవలి పరిణామాలు నిరూపించాయని కేటీఆర్ అన్నారు. ప్రధాన ప్రతిపక్షాలు చేయలేని పనిని యువత చేసి చూపించిందని, వారి ఉద్యమం కొత్త రాజకీయ దిశను చూపిందని పేర్కొన్నారు. సంప్రదాయ రాజకీయాల కంటే భిన్నంగా యువత ఆలోచిస్తోందని అన్నారు.
సోషల్ మీడియా ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తోందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. దానికి పరిమితులు విధించడం వాక్ స్వాతంత్ర్యానికి విరుద్ధమని చెప్పారు. సోషల్ మీడియా లేకుంటే ప్రభుత్వాల్లో చలనం వచ్చేది కాదని, ప్రజల గొంతుకకు అదే ప్రధాన వేదికగా మారిందన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాషపై కూడా కేటీఆర్ విమర్శలు చేశారు. రాజకీయాల్లో పరస్పర గౌరవం ఉండాలని, ఈ విషయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ జోక్యం చేసుకోవాలని కోరారు. మీడియాను ప్రభావితం చేసి ప్రజల్లో అభిప్రాయాలను మలచాలని ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నప్పటికీ, యువత ఉద్యమం అలాంటి రాజకీయ ధోరణులకు భిన్నమైన మార్పును తీసుకొచ్చిందని కేటీఆర్ అన్నారు.




# ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దిశ..

**విశాఖపట్నం, ఆగస్టు 1, సిరి న్యూస్**

ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించిన ఆయన, ఇవి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కొత్త ఊపు తీసుకువస్తాయని పేర్కొన్నారు.
సభలో తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధాని, సింహాచలం అప్పన్న స్వామి, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో నేటి కార్యక్రమం కీలక ఘట్టమని పేర్కొంటూ, రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో ఈ ప్రాజెక్టులు ముఖ్యపాత్ర పోషిస్తాయని అన్నారు.
కార్యక్రమంలో గిరిజన మహిళలు ప్రదర్శించిన థింసా నృత్యం తనను ఎంతగానో ఆకట్టుకుందని మోదీ చెప్పారు. ఒకేసారి వేలాది మంది గిరిజన మహిళలు ఈ నృత్యాన్ని ప్రదర్శించడం భారత సాంస్కృతిక వైభవానికి నిదర్శనమని



కొనియాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వాన్ని కూడా అభినందించారు.
భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వేగా మారుతుందని ప్రధాని తెలిపారు. ఇది యువతకు ఉపాధి, పెట్టుబడులు, పారిశ్రామిక అవకాశాలకు ద్వారాలు తెరుస్తుందని పేర్కొన్నారు. గతంలో విమానాశ్రయాలకు ఒకే కుటుంబం పేర్లు పెట్టేవారని, తమ ప్రభుత్వం మాత్రం దేశానికి సేవలందించిన మహనీయుల పేర్లను గౌరవిస్తోందని చెప్పారు.
భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని, ఈ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ప్రాణదాతగా హైదరాబాద్ మెట్రో..

**మొదటిపేజీ తరువాయి**

తరలించి అవయవ మార్పిడికి కీలక సహకారం అందించింది.
గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రిలో దానం చేసిన గుండె, ఊపిరితిత్తులను సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి అత్యవసరంగా తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రహదారులపై ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని వైద్య బృందం మెట్రో అధికారులను సంప్రదించగా, వారు వెంటనే ప్రత్యేక గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేశారు. దీంతో సుమారు 14 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 25 నిమిషాల్లో పూర్తి చేసి అవయవాలను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చారు. సమయానికి అవయవాలు చేరడంతో మార్పిడి ప్రక్రియకు అవసరమైన కీలక సమయం ఆదా అయింది.
భవిష్యత్తులో కూడా ఇలాంటి అత్యవసర వైద్య అవసరాలు, ప్రాణ రక్షణ కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తామని హైదరాబాద్ మెట్రో అధికారులు తెలిపారు.
సమయస్ఫూర్తితో స్పందించి అవయవాల రవాణాను విజయవంతం చేసిన మెట్రో సిబ్బందిపై వైద్య వర్గాలు, ప్రజలు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.

# పప్పు, పామాయిల్ సాగుపై దృష్టి పెట్టాలి: గవర్నర్

- **దిగుమతుల భారం తగ్గించేందుకు ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం**
- **ఎల్‌నినో నిపుణుల కమిటీ నివేదికను స్వీకరించిన గవర్నర్**
- **వ్యవసాయ రంగానికి దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమని సూచన**

**హైదరాబాద్, ఆగస్టు 1, సిరి న్యూస్**

దేశంలో పప్పు దినుసులు, వంటనూనెల కొరతను అధిగమించేందుకు పప్పు పంటలు, పామాయిల్ సాగుపై మరింత దృష్టి సారించాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల సూచించారు. దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించేందుకు ఈ పంటల సాగును విస్తరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.
లోక్ భవన్‌లో శనివారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ఎల్‌నినో ప్రభావంపై నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా గవర్నర్‌ను కలిసి ఎల్‌నినో ప్రభావంపై రూపొందించిన నిపుణుల కమిటీ నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయం, అనుబంధ రంగాలపై గవర్నర్ వారితో విస్తృతంగా చర్చించారు.
దేశంలో పప్పు దినుసుల ఉత్పత్తి అవసరాలకు సరిపోకపోవడంతో భారీ మొత్తంలో విదేశాల నుంచి దిగుమతులు చేసుకోవాల్సి వస్తోందని గవర్నర్ తెలిపారు. పప్పు దినుసుల దిగుమతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని పేర్కొన్నారు. అదే విధంగా వంటనూనెల అవసరాల కోసం కూడా భారీగా విదేశాలపై ఆధారపడుతున్న పరిస్థితిని తగ్గించాలంటే ఆయిల్ పామ్ సాగును మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.
పప్పు దినుసులు, పామాయిల్ సాగు పెరిగితే రాష్ట్రంతో పాటు దేశ అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తుందని గవర్నర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఉద్యానవన పంటలు, కూరగాయల సాగు అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సానుకూల ఫలితాలు ఇస్తున్నాయని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.
ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులు సమగ్రంగా ఉన్నాయని గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రశంసించారు. వ్యవసాయ రంగానికి ఉపయోగపడే విలువైన సూచనలను అందించిన కమిటీ చైర్మన్ డాక్టర్ జి. చిన్నారెడ్డితో పాటు సభ్యులను అభినందించారు.





# తెలంగాణ రైతాంగం జీవనాడి ఎస్సారెస్పీ: ఉత్తమ్ కుమార్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి**

ప్రాజెక్టులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. దాదాపు 56 ఏళ్లుగా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్న ఎస్సారెస్పీ రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. ప్రాజెక్టులో పూడిక పేరుకుపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోందని గుర్తించి పూడికతీతకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుత నీటి లభ్యత, వర్షపాతం పరిస్థితులను సమీక్షించిన అనంతరం రానున్న రెండు రోజుల్లో సాగునీటి విడుదలపై నిర్ణయం ప్రకటిస్తామని చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం నీటి నిల్వలు కొంత తక్కువగా ఉన్నందున రైతులు పరిస్థితిని అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల విషయంలో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. సాంకేతిక లోపాలు, నిర్మాణ సమస్యల కారణంగా దెబ్బతిన్న ఈ బ్యారేజీల పునరుద్ధరణకు ప్రభుత్వం శాస్త్రీయ విధానంలో చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ ప్రక్రియకు కేంద్ర జల సంఘం ఆమోదం కూడా లభించిందని, పనులను పూర్తి చేసి మళ్లీ వినియోగంలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించబడిందని, దానిని కూడా బీఆర్ఎస్ తమ ఘనతగా ప్రచారం చేసుకోవడం సరికాదని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టులు దశాబ్దాలుగా సమర్థంగా పనిచేస్తుండగా, ఇటీవల నిర్మించిన కొన్ని ప్రాజెక్టుల్లో నిర్మాణ లోపాలు బయటపడిన విషయాన్ని ప్రజలు గమనించాలని అన్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు దక్షిణ తెలంగాణలోని సాగునీటి పరిస్థితిని కూడా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నాగార్జునసాగర్‌కు ఎగువ ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం పెరిగే అవకాశాలు ఉన్నాయని, రాష్ట్రంలో ఎక్కడా రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

## ధరణి నుంచి భూ భారతి వరకు 'సెట్' విచారణ..

**హైదరాబాద్, ఆగస్టు 1, సిరి న్యూస్**

రాష్ట్రంలో ధరణి పోర్టల్ నుంచి భూ భారతి వరకు జరిగిన భూ లావాదేవీలు, అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సెట్) విచారణ కొనసాగిస్తోందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్, అసైన్డ్ భూముల కేటాయింపుల్లో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపించిన ఆయన, పూర్తి వివరాలను సేకరించి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడుతూ ధరణి మొదటి టెండర్ నుంచి భూ భారతి వరకు జరిగిన వ్యవహారాలను సెట్ పరిశీలిస్తుందని తెలిపారు. భూ భారతి వ్యవస్థను కేవలం జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ)కే అప్పగించామని, ఆ సంస్థ ఇతరులకు సేవలు అప్పగించిన అంశంతో ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఫోరెన్సిక్ ఆడిట్‌లో అన్ని వివరాలు వెలుగులోకి రాకపోవడంతోనే ప్రత్యేక దర్యాప్తు అవసరమైందన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, నిషేధిత జాబితాల అంశాలపై కూడా సెట్ పూర్తి వివరాలను సేకరిస్తుందని మంత్రి తెలిపారు.

# మీ సేవ సరికొత్త రికార్డు..

- **ఒక్కరోజే 2.20 లక్షల లావాదేవీలు**
- **జూలై 31న అత్యధిక రోజువారీ లావాదేవీల నమోదు**
- **కుటుంబ కార్డులు, రవాణా సేవలకు భారీ స్పందన**
- **సాంకేతిక అంతరాయాలు లేకుండా సేవలందించిన వ్యవస్థ**
- **డిజిటల్ పాలనలో తెలంగాణ ముందంజలో ఉందన్న శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, ఆగస్టు 1, సిరి న్యూస్:**

తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ పౌర సేవల వేదిక 'మీ సేవ' కొత్త రికార్డు సృష్టించింది. జూలై 31న ఒక్కరోజే 2,20,172 లావాదేవీలు నమోదై మీ సేవ ప్రారంభమైనప్పటి నుంచి అత్యధిక రోజువారీ లావాదేవీలుగా నిలిచాయని రాష్ట్ర సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మీ సేవ వేదికను నిరంతరం బలోపేతం చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. సేవల విస్తరణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడం, కొత్త సేవలను అనుసంధానం చేయడం వల్ల ఈ ఘనత సాధ్యమైందని వివరించారు. సాధారణంగా రోజుకు 70 వేల నుంచి 80 వేల వరకు లావాదేవీలు నమోదయ్యే మీ సేవలో ఒకే రోజులో 2.20 లక్షలకు పైగా సేవలు అందించడం డిజిటల్ పాలనపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు. ఆ రోజు కుటుంబ కార్డు దరఖాస్తులు, రవాణా శాఖ సేవలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం అత్యధికంగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇంత భారీ స్థాయిలో లావాదేవీలు జరిగినప్పటికీ ఎలాంటి సాంకేతిక



అంతరాయం లేకుండా సేవలు అందించగలిగామని మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పనిచేసిన మీ సేవ కేంద్రాల నిర్వాహకులు, వివిధ శాఖల అధికారులు, సాంకేతిక బృందాలను ఆయన అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజా సేవలను మీ సేవ వేదిక ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చి తెలంగాణను డిజిటల్ పాలనలో దేశానికే ఆదర్శంగా నిలబెడతామని స్పష్టం చేశారు.

# గోదావరి ఉద్ధృతిపై అప్రమత్తం..

- **ముంపు ప్రాంతాల్లో మంత్రి సీతక్క పర్యటన**
- **భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగింపు**
- **పునరావాస కేంద్రాల్లో బాధితులతో మాట్లాడిన మంత్రి**
- **సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**

**ములుగు, ఆగస్టు 1, సిరి న్యూస్**



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి నదిలో వరద ఉద్ధృతి పెరగడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ములుగు జిల్లా మంగపేట మండలంలో పర్యటించి వరద పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. మంగపేట మండల కేంద్రానికి చేరుకున్న మంత్రి గోదావరి ప్రవాహం, కరకట్ట పనుల పురోగతిని సమీక్షించారు. లోతట్టు ప్రాంతాల్లో ముంపు పరిస్థితులు, గ్రామాల పరిస్థితిపై రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి తాజా వివరాలు తెలుసుకున్నారు. మండలంలోని పొద్మూరు, ముస్లిం వాడ, బీసీ కాలనీ ప్రాంతాల నుంచి తరలించిన బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంత్రి సందర్శించారు. అక్కడ ఉన్న నిర్వాసితులతో మాట్లాడి వారికి అందుతున్న ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, వసతి ఏర్పాట్లపై ఆరా తీశారు. అవసరమైన సౌకర్యాల్లో ఎలాంటి లోటు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గోదావరి వరద ఉద్ధృతి తగ్గే వరకు సంబంధిత శాఖల అధికారులు ఎవరూ ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లకుండా అందుబాటులో ఉండాలని సీతక్క స్పష్టం చేశారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని ముంపు గ్రామాల పరిస్థితిపై తహసీల్దార్ తోట రవీందర్, ఎస్సై టీవీఆర్ సూరి, ఎంపీడీవో భద్రులు మంత్రికి వివరించారు.

## 7,437 పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్..

# ఆగస్టు 19 నుంచి దరఖాస్తులు

- **పోలీస్, ఎస్పీఎఫ్, ఫైర్ సర్వీసెస్, జైళ్ల శాఖల్లో ఖాళీల భర్తీ**
- **సెప్టెంబర్ 9 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**
- **ప్రిలిమ్స్, శారీరక పరీక్షలు, తుది రాత పరీక్షతో ఎంపిక**
- **అన్ని దశల్లో బయోమెట్రిక్ నమోదు తప్పనిసరి**

**హైదరాబాద్, ఆగస్టు 1, సిరి న్యూస్**




తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు రాష్ట్రంలోని పోలీస్, ఎస్పీఎఫ్, అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి దరఖాస్తుల షెడ్యూల్‌ను ప్రకటించింది. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆగస్టు 19 ఉదయం 8 గంటల నుంచి సెప్టెంబర్ 9 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బోర్డు సూచించింది.

అభ్యర్థులు దరఖాస్తులను బోర్డు అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే సమర్పించాల్సి ఉంటుంది. ఇతర మార్గాల్లో పంపే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేసింది. దరఖాస్తు రుసుముతో పాటు పరీక్షల నిర్వహణ, బయోమెట్రిక్ నమోదు, సాంకేతిక సేవలు, ఫలితాల ప్రక్రియకు సంబంధించిన ఖర్చులను కలిపి ఒకేసారి ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. నియామక ప్రక్రియలో మొదట ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించనున్నారు. కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి పోస్టులకు మూడు గంటల పాటు ఈ పరీక్ష జరగనుండగా, సాంకేతిక పోస్టులకు ప్రిలిమినరీ పరీక్ష ఉండదు. ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు శారీరక కొలతలు, శారీరక సామర్థ్య పరీక్షలు ఆధునిక డిజిటల్ పరికరాల సహాయంతో నిర్వహించనున్నారు. ఎస్‌సీటీ కానిస్టేబుల్ మెకానిక్, డ్రైవర్ పోస్టులకు శారీరక పరీక్షల అనంతరం ట్రేడ్ లేదా డ్రైవింగ్ పరీక్ష నిర్వహిస్తారు. చివరి దశలో తుది రాత పరీక్ష ఉంటుంది. కానిస్టేబుల్ పోస్టులకు ఒకే పరీక్ష నిర్వహించగా, సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు వివరణాత్మక పత్రాలతో కలిపి మొత్తం నాలుగు పరీక్షలు నిర్వహించనున్నారు. నియామక ప్రక్రియలో ప్రతి దశలో అభ్యర్థుల బయోమెట్రిక్ నమోదు తప్పనిసరిగా ఉంటుందని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు స్పష్టం చేసింది.

# జూలైలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం!

**మొదటిపేజీ తరువాయి**

సమర్థవంతంగా పనిచేస్తోందని సంస్థ సీఎండీ జితేష్ వి. పాటిల్ తెలిపారు. జూలై 2026 నెలలో సంస్థ పరిధిలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగినప్పటికీ.. ముందస్తు కార్యాచరణ, సబ్‌స్టేషన్ల సామర్థ్య పెంపు, కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం మరియు ఫీడర్ల అభివృద్ధి వంటి పటిష్ట చర్యల ద్వారా వినియోగదారులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా విద్యుత్ అందించినట్లు ఆయన వెల్లడించారు.

**రికార్డు స్థాయిలో డిమాండ్ మరియు సరఫరా..**

జూలై 25, 2026న టీజీఎస్పీడీసీఎల్ పరిధిలో సరికొత్తగా 10,447 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదైంది. జూలై 15, 2026న ఒక్కరోజే 209.91 మిలియన్ యూనిట్ల గరిష్ట విద్యుత్ సరఫరా జరిగింది. జూలై2026 నెల మొత్తంలో వినియోగదారులకు మొత్తం 5,701.73 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను విజయవంతంగా సరఫరా చేసినట్లు సీఎండీ తెలిపారు.

**ముందస్తు ప్రణాళికలతోనే మెరుగైన ఫలితాలు**

పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం, ఇప్పటికే ఉన్న సబ్‌స్టేషన్ల కెపాసిటీ పెంపు, ఫీడర్ల బలోపేతం, నెట్‌వర్క్ ఆధునీకరణ వంటి చర్యలను విస్తృతంగా అమలు చేయడం వల్లే ఈ స్థాయిలో నాణ్యమైన సరఫరా సాధ్యమైందని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావం, అధిక ఉష్ణోగ్రతలు, ప్రస్తుత వర్షాకాల పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ నెట్‌వర్క్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ, అదనపు సిబ్బందిని, సామగ్రిని సిద్ధంగా ఉంచడం ద్వారా ఎమర్జెన్సీలను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామన్నారు. వ్యవసాయ, గృహ, వాణిజ్య మరియు పారిశ్రామిక రంగాల నుంచి వస్తున్న డిమాండ్‌ను తట్టుకుంటూ క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది 24 గంటల పాటు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. ప్రజలందరికీ విశ్వసనీయమైన, నిరంతర విద్యుత్ సేవలను అందించేందుకు భవిష్యత్తులోనూ ఇలాంటి ముందస్తు చర్యలనే మరింత పటిష్టంగా కొనసాగిస్తామని సీఎండీ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు.

# ఇకపై వారానికి రెండు రోజులు ప్రజాబాట..

**తెలంగాణ బ్యూరో (సిరి న్యూస్):**

తెలంగాణ విద్యుత్ శాఖలో వినియోగదారుల సమస్యలను మరింత వేగంగా పరిష్కరించేందుకు, ప్రజలకు మరింత చేరువయ్యేందుకు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. పల్లెల్లో ప్రజాబాట, నగరాల్లో బస్తీ బాట పేరుతో నిర్వహిస్తున్న ప్రజా సంపర్క కార్యక్రమాన్ని ఇకపై వారానికి రెండు రోజులు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు గతంలో కేవలం మంగళవారం మాత్రమే నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఇకపై ప్రతి శుక్రవారం కూడా నిర్వహించాలని ఆపరేషన్ సీజీఎం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ప్రజల నుంచి విద్యుత్ సమస్యలపై అందుతున్న ఫిర్యాదులు, వాటిపై క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిష్కారాల పురోగతిని కార్పొరేట్ కార్యాలయం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్నందున, గ్రామీణ □ పట్టణ ప్రాంతాలలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ కార్యక్రమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలోనే తెలుసుకొని వెంటనే పరిష్కరించేందుకు ఈ పెంపు ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

**ఇక 4 రోజులే కార్యాలయంలో..?**

టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని అన్ని ఆపరేషన్ స్థాయి అధికారులు ఇకపై వారానికి రెండు రోజులు ప్రజల మధ్యే ఉంటూ క్షేత్రస్థాయి పాలన అందించనున్నారు. మిగిలిన 4 రోజులు కార్యాలయాల్లో అందుబాటులో ఉంటూ పరిపాలనా పరమైన విధులను నిర్వర్తించనున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు ప్రజల చెంతకు వెళ్లేలా ఈ విధానాన్ని రూపొందించారు. గతంలో కేవలం ఒక్క రోజు నిర్వహించిన బస్తీ బాట మంచి సత్ఫలితాలు ఇవ్వడంతో పాటు ప్రజల నుంచి సానుకూల స్పందన రావడంతో, యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని మరో రోజుకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది.

## ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలకు పటిష్ట విద్యుత్ ఏర్పాట్లు

**సికింద్రాబాద్, ఆగస్టు 1 (సిరి న్యూస్):**

సికింద్రాబాద్‌లోని ప్రసిద్ధ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల సందర్భంగా లక్షలాది మంది భక్తులకు ఎలాంటి విద్యుత్ అంతరాయాలు కలగకుండా తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) అత్యంత పటిష్టమైన విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఈ ఏర్పాట్లను శనివారం ఉదయం 9:30 గంటలకు టీజీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థ, భద్రతా చర్యలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకున్న ముందస్తు జాగ్రత్తలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి విద్యుత్ అంతరాయం కలగకుండా టీజీఎస్పీడీసీఎల్ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా ఆలయానికి ప్రత్యేకంగా 315 కేవీఏ సామర్థ్యం గల డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కేటాయించగా, ఆలయ పరిసర ప్రాంతాల నిమిత్తం మరో 3 నెంబర్లు 500 కేవీఏ, 5 నెంబర్లు 315 కేవీఏ, 1 నెంబర్ 160 కేవీఏ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా నిరంతర విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే తక్షణమే స్పందించేందుకు వీలుగా 500 కేవీఏ సామర్థ్యం గల ఒక మొబైల్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా క్షేత్రస్థాయిలో అందుబాటులో



ఉంచారు. ఈ ఏర్పాట్ల పర్యవేక్షణ మరియు నిర్వహణ కోసం నిరంతరం విధుల్లో ఉండేలా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. రోజువారీగా మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా ప్రతి షిఫ్ట్‌కు ముగ్గురు అసిస్టెంట్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో 20 మంది ప్రత్యేక సిబ్బందిని కేటాయించారు. ఎలాంటి ఫిర్యాదులనైనా వెంటనే పరిష్కరించేందుకు వీలుగా 1912 ఎమర్జెన్సీ రెస్పాన్స్ వాహనాన్ని సిద్ధంగా ఉంచారు. విధుల్లో ఉన్న సిబ్బంది అందరికీ అవసరమైన భద్రతా పరికరాలు, వాకీటాకీలు అందజేసి, ఎప్పటికప్పుడు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఉత్సవాలు విజయవంతమయ్యేలా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఎండీ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ.. ఉత్సవాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి పునరుద్ధరించేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. విద్యుత్ భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, పోలీసు, జీహెచ్ఎంసీ తదితర శాఖలతో సమన్వయంగా పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు విద్యుత్ సరఫరా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తామని ఆయన తెలిపారు.

## అక్రమ కట్టడాల పై అధికారుల కొరడా

**అమీన్పూర్ ఆగస్టు 1 సిరి న్యూస్**



అమీన్పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని సర్వే నంబర్ 993/1 గండిగూడెం పరిధిలోని 330 లో విలువైన ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలపై రెవిన్యూ అధికారులు శనివారం జెసిబిలతో కూల్చివేతలు చేపట్టారు. సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ఇకపై ప్రభుత్వ స్థలాలను అక్రమించేందుకు ప్రయత్నిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, అక్రమణదారులపై కఠినమైన చట్టపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ మండల కేంద్రంలోనే కేటాయించాలని కలెక్టర్ కు వినతి



**వెల్దుర్తి, ఆగస్టు 01,(సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండల కేంద్రంనికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను వెల్దుర్తి మండలం కుకునూర్ గ్రామంలో కేటాయిస్తున్నారన్న విషయం తెలుసుకున్న వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు యువ నాయకులు, అలాగే గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, మండల కేంద్రానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను తరలించ వద్దని కోరుతూ సర్పంచ్ ఆదర్శ్ ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం మెదక్ కలెక్టర్ ప్రతిమ సింగ్, అలాగే జిల్లా విద్యాధికారి రాజు కు వినతి పత్రం సమర్పించారు. పాఠశాలను వెల్దుర్తి మండల కేంద్రం లోనే కొనసాగించాలని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిర్ణయాన్ని ఉప సంవరించుకోవాలని కోరారు. నిర్ణయం మారితే విద్యార్థుల విద్య పై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆదర్శ్, ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్, నాయకులు శేఖర్ గౌడ్, చందు, శేఖర్, మహేందర్, రమేష్, నవీన్ పటేల్, ప్రవీణ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## మైలారం, గోల్లపల్లికి రోడ్డు వరం.!..

- రూ.1.70 కోట్లతో బీటీ రహదారికి శ్రీకారం..
- జోగాపూర్–మైలారం రాకపోకలకు ఊరట..
- ఎన్నికల హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే వినోద్..
- గ్రామీణ అభివృద్ధికి మరో కీలక అడుగు..



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 1 (సిరి న్యూస్)**

నెన్నెల మండలంలోని జోగాపూర్ టీ రోడ్డు నుంచి మైలారం మత్తడి వాగు వంతెన వరకు రూ.1.70 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రహదారి పనులకు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి శనివారం శంకుస్థాపన చేశారు. కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించిన ఆయన, ఎన్నికల సమయంలో మైలారం, గోల్లపల్లి గ్రామాల ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి తెలిపారు. ఈ రహదారి పూర్తయితే మైలారం, గోల్లపల్లి గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో బెల్లంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా మైలారం, గోల్లపల్లి గ్రామాల ప్రజలు ఎన్నికల హామీని అమలు చేస్తూ రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామికి, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రిమినల్స్ కాదు దేశానికి 'కీ రోల్స్'

- విద్యార్థులకు గద్దెనెక్కించడం తెలుసు.. దించడం తెలుసు.
- విద్యార్థులని దూషించిన రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి.
- బీజేవైఎం ఆధ్వర్యంలో సీఎం దిష్టి బొమ్మ దగ్ధం.
- బీజేవైఎం మెదక్ జిల్లా అధ్యక్షుడు కందనూరి శ్రీనివాస్ గౌడ్.

**మెదక్ ఆగష్టు,01(సిరి న్యూస్)**





ఇంజనీరింగ్ విద్యార్థులను సీఎం రేవంత్ రెడ్డి క్రిమినల్స్, సైకోలతో పోల్చి మాట్లాడాడం సిగ్గుచేటని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు.

శనివారం భారతీయ జనతా పార్టీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండె పిలుపుమేరకు ఇంజనీరింగ్ విద్యార్థులను ఉద్దేశించి క్రిమినల్స్ అన్నందుకు నిరసనగా బీజేవైఎం ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ,వాల్దాస్ అర్వింద్ గౌడ్ లు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యార్థులను క్రిమినల్స్ అనడం సైకోలు అనడం సిగ్గుచేటన్నారు.98 కేసులు ఉన్న రేవంత్ రెడ్డి క్రిమినల్ అవుతారు కానీ,విద్యార్థులను ఎట్లా క్రిమినల్స్ అంటారని మండిపడ్డారు. పరిపాలన చేతకాక రియంబర్స్ మెంట్ ఇవ్వమని విద్యార్థులు అడుగుతే క్రిమినల్స్ వెస్ట్ అనడం సరి కాదన్నారు. విద్యాశాఖ నీ దగ్గరే ఉంచుకొని విద్యార్థులకు ఎలాంటి న్యాయం చేయకుండా నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకుండా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు.విద్యార్థులకు 15 వేల కోట్లు రీయంబర్స్ మెంట్ ఇవ్వకుండా జల్సాలు చేసుకుంటూ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు.ఏ విధంగా అయితే గత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించామో? విద్యార్థుల జోలికొస్తే అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా గద్దె దించడం కాయం.. ఖబర్దార్ అని హెచ్చరించారు. పరిపాలన చేతకాకపోతే రాజీనామా చేయ్ లేదంటే మా రియాంబర్స్మెంట్ ఇవ్వాలని విద్యార్థులని క్రిమినల్స్ అన్నందుకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని లేని యెడల పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామన్నారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన బీజేవైఎం కార్యకర్తలని అక్రమంగా పోలీస్ స్టేషన్లకు తరలించి కేసులు పెట్టడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు వాల్దాస్ అరవింద్ గౌడ్ బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్ బీజేవైఎం నాయకులు ప్రేమ్, గణేష్,నర్సింగ్, రవి,రమేష్, గిరి, ప్రవీణ్, మధు,బబ్లూ,సన్నీ, మహేందర్, శ్యామ్ గౌడ్ చందు,సాయి,రాజేష్, దశరథ్, అనిల్,రాహుల్, సాయి గౌడ్, విక్రమ్, ప్రణయ్, నాయకులు విద్యా ర్థులు పాల్గొన్నారు.

# స్కిల్ డెవలప్మెంట్ శిక్షణతో ఉపాధి అవకాశాలు

యువత సద్వినియోగం చేసుకోవాలి.

- రామాయంపేట మున్సిపల్ చైర్పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా. కమిషనర్ రవీందర్.

**రామాయంపేట, ఆగస్టు 1 (సిరి న్యూస్ )**



నిరుద్యోగ యువత ఉచిత స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని రామాయంపేట మున్సిపల్ చైర్పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా, కమిషనర్ ఏ. రవీందర్ పిలుపునిచ్చారు. ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వారు తెలిపారు. హాస్పిటాలిటీ, హెల్త్కేర్ (GDA), బ్యూటీషియన్, ఎలక్ట్రికల్ అండ్ సోలార్, ఆటోమొబైల్ (2 వీలర్, 4 వీలర్ మెకానిక్), డేటా ఎంట్రీ, ఎంఓఏ (MOA) వంటి విభాగాల్లో శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి, 10వ తరగతి లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగిన యువత ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణ పూర్తిచేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు ఉచిత వసతి, భోజనం, శిక్షణ సామగ్రి కూడా అందజేయనున్నట్లు వివరించారు. ఆసక్తి గల యువత ఆగస్టు 15లోపు రామాయంపేట మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 91775 64914 నంబర్ను సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని యువత తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని చైర్పర్సన్, కమిషనర్ ఆకాంక్షించారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ఎజెండాగా...

- 3 న టి యు డబ్ల్యూ జే (ఐ జేయు)జిల్లా కార్యవర్గ సమావేశం
- సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి.

**రామాయంపేట, ఆగష్టు 1 (సిరి న్యూస్)**



తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి యు డబ్ల్యూ జే –ఐ జే యు) సంగారెడ్డి జిల్లా శాఖ తొలి కార్యవర్గ సమావేశం సోమవారం నాడు సదాశివపేటలో జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఆర్.అనిల్ కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్ శనివారం తెలిపారు. జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో ఈ సమావేశానికి చాలా ప్రాధాన్యత ఉన్నదని వారు అన్నారు. గత నెల 9వ తేదీన సంగారెడ్డిలో జిల్లా మహాసభ ను జర్నలిస్టుల ఆకాంక్షలకు అనుగుణంగా పెద్ద ఎత్తున నిర్వహించినట్లు వారు చెప్పారు. జిల్లా నలు మూలల నుంచి పెద్ద ఎత్తున జర్నలిస్టులు హాజరైనందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా దశాబ్దాలుగా తమ సంఘం పనిచేస్తున్నదని వారు వివరించారు. వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయించడంతో పాటు..వాటిని మండల స్థాయి గ్రామీణ జర్నలిస్టులకు కూడా ప్రభుత్వం ఇచ్చే విధంగా పోరాటం చేశామన్నారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో, నేడు తెలంగాణలో కూడా జర్నలిస్టుల అభివృద్ధికి, సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి పాటు పడుతున్న సంఘం గా ఉన్నామని బండారు యాదగిరి వివరించారు. సదాశివపేటలో సోమవారం జరిగే జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే పైసల్ హాజరవుతున్నారని వివరించారు. ఈ సమావేశంలో అనేక విషయాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలం సాధించేందుకు చర్చిస్తామని అన్నారు. అదేవిధంగా ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డు మంజూరు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ని నియోజకవర్గస్థాయి కమిటీల ఏర్పాటు గురించి చర్చిస్తామని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమము, అభివృద్ధికి సంబంధించిన ఇతర అంశాలపై కూడా ఈ సమావేశంలో కార్యాచరణ ప్రకటించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులు సకాలంలో హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బోనాల పండుగను వైభవంగా నిర్వహించుకోవాలి

- ఐదు గ్రామాలకు రూ. లక్ష చొప్పున నిధుల కేటాయింపు
- ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్


**గుమ్మడిదల, ఆగస్టు1 (సిరి న్యూస్):**



గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో నిర్వహించే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో అత్యంత వైభవంగా నిర్వహించుకోవాలని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మున్సిపాలిటీ కేంద్రంలోని పోచమ్మ తల్లి బోనాలు, మంగళవారం జరగనున్న ఎల్లమ్మ తల్లి బండ్లు, బోనాల ఊరేగింపులకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. గ్రామ దేవాలయ కమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్రెడ్డి, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి పండుగ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన చైర్మన్, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని గుమ్మడిదల, బొంతపల్లి, వీరన్నగూడెం, దోమడుగు, అన్నారం గ్రామాల్లో బోనాల పండుగ ఏర్పాట్ల కోసం ఒక్కో గ్రామానికి రూ.1 లక్ష చొప్పున నిధులు కేటాయించినట్లు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పండుగలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బండ్లు, తొట్టెల ఊరేగింపుల్లో పాల్గొనే యువత భక్తిశ్రద్ధలతో వ్యవహరించడంతో పాటు పోలీసులు, అధికారులు సూచించే భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ సామరస్య వాతావరణంలో వేడుకలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కత్తుల రమేష్, గ్రామ పెద్దలు పడమటి లక్ష్మారెడ్డి, నాయకులు వెంకట్రాం రెడ్డి, కొండల్ రెడ్డి, సత్యనారాయణ, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, బాల్రాజ్ యాదవ్, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆషాఢ మాస బోనాలకు సర్వం సిద్ధం

- అమ్మవార్ల ఆలయాల్లో సందడి
- రంగురంగుల అలంకరణలతో కళకళలాడుతున్న దేవాలయాలు
- గుమ్మడిదల, అన్నారం గ్రామాల్లో బోనాల ఉత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయాలు





**గుమ్మడిదల, (సిరి న్యూస్):**

ఆషాఢ మాసం... తెలంగాణ ఆధ్యాత్మిక సంస్కృతికి ప్రతీక. ఈ మాసం రాగానే గ్రామ దేవతల ఆలయాలు భక్తుల రాకపోకలతో కళకళలాడుతాయి. అమ్మవారిపై అపార భక్తిని చాటుతూ మహిళలు రంగురంగుల బోనాలను తలపై ధరించి మొక్కులు సమర్పించడం బోనాల పండుగ ప్రత్యేకత. భక్తి, సంప్రదాయం, సంస్కృతికి ప్రతిరూపమైన ఈ ఉత్సవాల కోసం గుమ్మడిదల, అన్నారం గ్రామాల్లోని పోచమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ ఆలయాలు విద్యుత్ దీపాలు, పూలతోరణాలు, రంగుల అలంకరణలతో ముస్తాబవుతూ పండుగ శోభను సంతరించుకుంటున్నాయి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలకు గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని గుమ్మడిదల, అన్నారం గ్రామాలు సిద్ధమవుతున్నాయి. ఆషాఢ మాసం ప్రారంభమైతే చాలు గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లోనూ అమ్మవార్ల ఆలయాల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. ప్రతి ఇంటా భక్తిశ్రద్ధలు వెల్లివిరుస్తూ, బోనాల పండుగ సందడి ప్రారంభమవుతోంది. ఆషాఢ మాసంలో మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో అలంకరించుకుని, పసుపు, కుంకుమ, వేపాకులు, పూలతో అందంగా అలంకరించిన బోనాలను తలపై ధరించి గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. అమ్మవారిని ప్రసన్నం చేసుకుని కుటుంబ సౌఖ్యం, పంటల సమృద్ధి, గ్రామ శాంతి కోసం భక్తులు బోనాలను సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు.

**గుమ్మడిదల, అన్నారంలో బోనాల పండుగలు**

గుమ్మడిదల, అన్నారం గ్రామాల్లోని పోచమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ తదితర గ్రామ దేవతల ఆలయాలు ఇప్పటికే రంగురంగుల విద్యుత్ దీపాలు, తోరణాలు, పూల అలంకరణలతో సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. ఆలయ కమిటీలు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేపట్టి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్ వెలుగులు, పరిశుభ్రత, క్యూ లైన్లు, భద్రత వంటి ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నాయి. బోనాల ఉత్సవాల సందర్భంగా సంప్రదాయ డప్పు వాయిద్యాలు, పోతురాజు విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీలు సన్నాహాలు చేస్తున్నాయి. పండుగ రోజున వేలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకునే అవకాశం ఉండటంతో గ్రామాల్లో పండుగ శోభ ఇప్పటికే కనిపిస్తోంది. స్థానిక ప్రజలు కూడా తమ ఇళ్లను శుభ్రపరిచి, రంగవల్లులు వేసి, పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ బోనాల ఉత్సవాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రామచంద్రాపురం ఈఎస్ఐ రోగులకు ఊరట..

- సూపర్ స్పెషాలిటీ మందుల పంపిణీ పునరుద్ధరణకు 10 రోజుల్లో ఆదేశాలు: జాయింట్ డైరెక్టర్ కాంతిసాగర్



**రామచంద్రపురం, ఆగస్టు 1 (సిరి న్యూస్):**

రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ మందుల పంపిణీని తిరిగి ప్రారంభించేందుకు అవసరమైన ఆదేశాలు 10 రోజుల్లో జారీ చేస్తామని తెలంగాణ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ స్టేట్ మెడికల్ జాయింట్ డైరెక్టర్ కాంతిసాగర్ తెలిపారు. సీఐటీయూ పటాన్‌చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జాయింట్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాండురంగారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం సూపర్ స్పెషాలిటీ మందులు నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో మాత్రమే అందుబాటులో ఉండటంతో సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, మెదక్ ప్రాంతాలకు చెందిన వేలాది మంది ఈఎస్ఐ బీమా కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ప్రతి నెలా నాచారం వెళ్లాల్సి వచ్చి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జాయింట్ డైరెక్టర్ కాంతిసాగర్ సమస్యను సానుకూలంగా పరిశీలించి, రామచంద్రాపురం ఈఎస్ఐ ఆసుపత్రిలోనే సూపర్ స్పెషాలిటీ మందుల పంపిణీని పునరుద్ధరించేందుకు అవసరమైన ఆదేశాలు పది రోజుల్లో జారీ చేస్తామని వెల్లడించినట్లు పాండురంగారెడ్డి తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాండురంగారెడ్డి, ఈఎస్ఐ మాజీ బోర్డు సభ్యుడు బి. అర్జున్, శాండ్‌విక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకుడు గంగాధర్ పాల్గొన్నారు.

# వటపల్లి పోలీస్ స్టేషన్ పై దాడి..

- ఫర్నిచర్... అద్దాలు.. ధ్వంసం
- యువకుడి మృతిపై అనుమానాలు
- స్టేషన్‌పైదాడి చేసిన వారిపై కేసులు ?
- వట్‌పల్లి స్టేషన్ ను సందర్శించిన జోగిపేట సీఐ అనిల్ కుమార్





**జోగిపేట, ఆగస్టు 01(సిరి న్యూస్):**

సంగారెడ్డి జిల్లా వట్ పల్లి పోలీస్ స్టేషన్ పై దరఖాస్తు పల్లి గ్రామస్తులు దాడి చేయడం స్థానికంగా సంచలనం రేపింది. అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందడంతో గ్రామస్థులు పోలీస్ స్టేషన్ పై దాడి చేసి ఫర్నీచర్ ను ద్వంసం చేశారు. దాడి చేయకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులను సైతం వెంబడించారు. ధరఖాస్తు పల్లి గ్రామానికి చెందిన బీరప్ప అనే వ్యక్తి వట్‌పల్లి ɕమండల పరిధిలోని మేడికుంద గ్రామ శివారులోని చరిత ఫ్యామిలీ దాబాలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం నాడు బీరప్ప (22) చరిత ఫ్యామిలీ దాబా సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని అత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం మేరకు వట్‌పల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని చెట్టుకు వేలాడుతున్న బీరప్ప మృతదేహాన్ని కిందకు దింపి, అతను పనిచేసే దాబా ముందు మృతదేహాన్ని ఉంచారు. పోలీసుల సమాచారం మేరకు బీరప్ప కుటుంబీకులు ఘటన స్థలానికి చేరుకునే సరికి మృతదేహాన్ని కిందకు దింపడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల సమ„ý ంలో మృతదేహాన్ని చెట్టు నుంచి కిందకు దింపాల్సిఉండగా, మేము రాకుండా ఏలా కిందకు దింపుతారని పోలీసులను, దాబా యజమానులను నిలదీశారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. బీరప్ప మృతిపై తమకు అనుమానం ఉందని, ఎవరో చంపేసి చెట్టుకు వేలాడదీశారని, పోలీసులు, దాబా యజమానులు కుమ్మక్కెయ్యారని వారు ఆరోపించారు.

**పోలీస్ స్టేషన్‌పై దాడి ఫర్నిచర్ ధ్వంసం:**

చెట్టుకు ఉరివేసుకుని అత్మహత్యకు పాల్పడిన వ్యక్తిని కుటుంబ సభ్యులు లేకుండా చెట్టు నుంచి మృతదేహాన్ని పోలీసులు కిందకు దింపడం వివాదానికి దారి తీసింది. పోలీసులను నిలదీస్తున్న దరఖాస్తు పల్లి గ్రామస్థుడిపై పోలీసులు చేయి చేసుకొవడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామస్థులంతా ఒక్కసారిగా స్టేషన్‌లోపలికి చోరబడి ఫర్నిచర్, కుర్చీలను, అద్దాలను ధ్వంసం చేశారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఎస్ఐ లక్ష్మి కాంత్‌రెడ్డితో పాటు ఇతర పోలీసులపైకి సైతం దూసుకేళ్లారు. దీంతో పోలీస్ స్టేషన్ ప్రాంగణమంతా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న జోగిపేట సీఐ అనిల్ కుమార్ అదనపు బలగాలతో వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. దాబా యజమాని గొల్ల శ్రీనివాస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదే విధంగా ప్రభుత్వ అస్తులను ధ్వంసం చేసిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. ఏలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకొకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామని సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.



# వెల్దుర్తిలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో స్కార్ఫ్ డే కార్యక్రమం





**వెల్దుర్తి, ఆగస్టు 01,(సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండల కేంద్రంలో గల పియం శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్ యందు ఘనంగా స్కార్ఫ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, స్కౌట్ మాస్టర్ ఖదీర్ పాషా, గైడ్ టీచర్ అర్చన, విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ స్కార్ఫ్‌లను ధరింపజేశారు. అనంతరం స్కార్ఫ్ ప్రాముఖ్యతను వివరిస్తూ, అది క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు మరియు ఐకమత్యానికి ప్రతీక అని తెలిపారు. విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం ఆశయాలను ఆచరిస్తూ సమాజ సేవలో ముందుండాలని, మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ఉత్సాహంగా స్కార్ఫ్‌లు ధరించి స్కౌట్స్ ప్రతిజ్ఞను పునరుద్ఘాటించారు.అలాగే పాఠశాల ఆవరణలో నేడు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ మొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య పాల్గొని మొక్కలు నాటి, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, అర్చన, ఖదీర్ పాషా, విజయ్ మోహన్ రాజ్, చార్లెస్, అమూల్య, జయసుధ, వాణిశ్రీ, రేణుక దేవి, ప్రశాంతి, రాము, రాధిక, బోధనేతర సిబ్బంది, అలాగే స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు.

# రేషన్ దుకాణాలపై ఆకస్మిక తాహసిల్దార్ తనిఖీలు..



**హత్నూర, ఆగస్టు 01,(సిరి న్యూస్)**

హత్నూర మండలంలోని దేవులపల్లి గ్రామంలో రేషన్ దుకాణంను తహసీల్దార్ ఫర్హీన్ షేక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల నిల్వలు, పంపిణీ విధానం, ఈ–కేవైసీ నమోదు, స్టాక్ రిజిస్టర్లు, పంపిణీ రికార్డులు, లబ్ధిదారులకు అందుతున్న సేవలపై క్షుణ్ణంగా పరిశీలించారు. రేషన్ సరుకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని డీలర్ కు సూచించారు. అంతేకాకుండా మండలం లోని రేషన్ డీలర్లు లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పూర్తి స్థాయిలో సరుకులు అందించాలని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ–కేవైసీ పూర్తి చేయని అర్హులైన రేషన్ కార్డుదారులకు వెంటనే ప్రక్రియ పూర్తి చేయించేలా చర్యలు చేపట్టాలని డీలర్లను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రేషన్ పంపిణీ సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

# విద్వేషపూరిత ప్రసంగాలు, నేరాల నివారణ బిల్లుపై సెలక్షన్ కమిటీ తొలి సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు 1 (సమయం న్యూస్.)**

తెలంగాణ విద్వేషపూరిత ప్రసంగం మరియు విద్వేషపూరిత నేరాల (నివారణ) బిల్లు–2026పై ఏర్పాటైన సెలక్షన్ కమిటీ తొలి సమావేశం శనివారం శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో జరిగింది. సమావేశంలో శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, సెలక్షన్ కమిటీ చైర్మన్, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌తో పాటు కమిటీ సభ్యులు, కౌన్సిల్ సెక్రటరీ డా. వి. నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, బిల్లును సమగ్రంగా పరిశీలించి తగిన సిఫార్సులతో నివేదికను శాసనసభకు సమర్పించే కీలక బాధ్యత కమిటీపై ఉందన్నారు. నిష్పాక్షికంగా, సమగ్రంగా, నిర్మాణాత్మక చర్చలతో కమిటీ తన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. సెలక్షన్ కమిటీ చైర్మన్, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ, సమాజానికి ఉపయోగపడేలా, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలిచే విధంగా సభ్యుల సూచనలతో నియమాలను రూపొందిస్తామని తెలిపారు. కమిటీలో అనుభవజ్ఞులైన సభ్యులు ఉన్నారని, అందరి సహకారంతో సమిష్టి నిర్ణయాలు తీసుకుని, క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ వీలైనంత త్వరగా నివేదికను సభాపతికి సమర్పిస్తామని చెప్పారు.

## రెండు వేల రూపాయల జరిమానా



**తూప్రాన్ ఆగస్టు 01 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో మున్సిపాలిటీ నిధులతో ఇటీవల నిర్మించిన సీసీ రహదారిని ఎలాంటి ముందస్తు సమాచారం అనుమతి లేకుండా రోడ్డును తవ్వడాన్ని మున్సిపల్ అధికారులు శనివారం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించిన 5వ వార్డు నివాసి హరిబాబు పై రూ.2,000/ జరిమానా విధించారు ప్రజా ధనంతో నిర్మించిన మున్సిపల్ ఆస్తులను దెబ్బతీయడం చట్టవిరుద్ధమని రహదారులు కాలువలు ఫుట్‌పాత్‌లు లేదా ఇతర మున్సిపల్ ఆస్తులను తవ్వాలంటే సంబంధిత అధికారుల నుండి తప్పనిసరిగా ముందస్తు అనుమతి పొందాలని కమిషనర్ తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా అనుమతి లేకుండా మున్సిపల్ ఆస్తులకు నష్టం కలిగించినట్లయితే వారిపై మున్సిపల్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భారీగా జరిమానాలు విధించబడతాయని హెచ్చరించారు.

## తెలంగాణలో పెట్టుబడులకు సంపూర్ణ భరోసా

### సి ఐ ఐ సమావేశంలో సి ఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 1 (సమయం న్యూస్):**

సీఐఐ ప్రతినిధుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణను దేశంలోనే అత్యంత పెట్టుబడి అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని ప్రకటించారు. పెట్టుబడిదారులకు పూర్తి భద్రత, వేగవంతమైన అనుమతులు, అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించేందుకు "తెలంగాణ రైజింగ్–2047" విజన్‌తో ముందుకెళ్తున్నామని, 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 5 శాతం నుంచి 10 శాతానికి, 2037 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం CORE–PURE–RARE మోడల్‌ను అమలు చేస్తున్నామని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల సేవారంగం, బయట తయారీ రంగం, రీజినల్ రింగ్ రోడ్ వెలుపల వ్యవసాయం, అనుబంధ రంగాలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ సిటీ–మచిలీపట్నం పోర్టు మధ్య 12 లేన్ల రహదారి, పారిశ్రామిక క్లస్టర్లు, రేడియల్ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తామని చెప్పారు. అమెజాన్, అదానీ వంటి సంస్థల భారీ పెట్టుబడులు, జీసీసీల్లో 200 కంపెనీల ఆసక్తి తెలంగాణపై పెట్టుబడిదారుల విశ్వాసానికి నిదర్శనమన్నారు. పరిశ్రమల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రతి మూడు నెలలకు తాను స్వయంగా పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమవుతానని తెలిపారు. "Think Global... Invest Glocal" అంటూ ప్రపంచ పెట్టుబడిదారులను తెలంగాణకు ఆహ్వానించారు.

## భద్రాచలం వద్ద గోదావరికి మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది

### క్షేత్రస్థాయిలో వరద పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్ అంకిత్

**భద్రాచలం, ఆగస్టు 1 (సమయం న్యూస్):**

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం శనివారం ఉదయం 10 గంటలకు 56 అడుగులకు చేరడంతో మూడో ప్రమాద హెచ్చరిక ను జిల్లా కలెక్టర్ అంకిత్ జారీ చేశారు గోదావరి లో ప్రస్తుతం 15.90 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అంకిత్ గోదావరి స్నాన ఘాట్లు, కరకట్ట ప్రాంతం, భద్రాచలం–కూనవరం ప్రధాన రహదారి వెంట వరద పరిస్థితులను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను టామ్ టామ్, మైకింగ్ ద్వారా అప్రమత్తం చేసి ఆలస్యం చేయకుండా పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, భోజనం, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. వరద నీరు చేరిన ప్రాంతాల్లో వెంటనే బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, ప్రజలు ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా పోలీసు నిఘా పెంచాలని ఆదేశించారు. గోదావరిలో స్నానాలు, ఈత, పడవ ప్రయాణాలు, వరద ప్రాంతాల్లో సెల్ఫీలు పూర్తిగా నిషేధించాలని హెచ్చరించారు. వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని, అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన సహాయం కోసం జిల్లా లో కంట్రోల్ రూమ్ ఏరుతూ చేశారు అవసరమైన వారు 08744-241950 లేదా వాట్సాప్ నంబర్ 9392919743 నంబర్ల ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

## గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ: మంత్రి సీతక్క

**ఏటూరు నాగారం, ఆగస్టు 1 (సమయం న్యూస్):**

గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. వరదల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించి ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించగలిగిందన్నారు. శనివారం ఏటూరు నాగారం మండలం రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి వరద ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీవో లెనిన్ వస్సల్ టోప్పోతో కలిసి మంత్రి పరిశీలించారు.

# గడ్డి మందుల ముఠా అరెస్ట్..

- మహారాష్ట్ర గడ్డి మందుల అక్రమ రవాణా భగ్నం.!..
- నలుగురు నిందితుల అరెస్ట్.. రూ.1.44 లక్షల సరుకు స్వాధీనం.!..
- కారు, రెండు ద్విచక్ర వాహనాలు సీజ్.!..
- లైసెన్సు దుకాణాల్లోనే మందులు కొనాలని రైతులకు డీసీపీ హెచ్చరిక.!



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 1 (సిరి న్యూస్)**

మహారాష్ట్ర నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా గడ్డి మందులను అక్రమంగా తరలించి రైతులకు విక్రయించేందుకు ప్రయత్నించిన ముఠాపై రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి రూ.1.44 లక్షల విలువైన గడ్డి మందులు, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తాండూర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ ఎ. భాస్కర్ అరెస్టు వివరాలను వెల్లడించారు. భీమిని పోలీస్ స్టేషన్ పరిధిలో గుండా రాజు, పార్వతి కిరణ్, రుకుం వెంకటేష్, పల్లె రవీందర్‌లను అరెస్టు చేశారు. భీమిని ఎస్సై కోటేశ్వర్ తన సిబ్బందితో కలిసి రాంపూర్ గ్రామ శివారు, వెంకటాపూర్ పరిసరాల్లో తనిఖీలు నిర్వహించి గడ్డి మందులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మహారాష్ట్రలోని రాజురా నుంచి గడ్డి మందులు తీసుకొచ్చి భీమిని మండలంలో రైతులకు అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో వెల్లడైందని డీసీపీ తెలిపారు. రైతులు లైసెన్సు కలిగిన దుకాణాల్లోనే మందులు కొనుగోలు చేసి రసీదు తీసుకోవాలని, అక్రమ విక్రయాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ బి. శ్రీనివాస్ రావు, తాండూర్ సీఐ దేవయ్య, భీమిని ఎస్సై కోటేశ్వర్, టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు దీకొండ రమేష్, లక్ష్మణ్ రావు, సిబ్బంది లవన్, రాజేందర్, మట్ట రమేష్, మైకాంత్, నీలిగొండ అంజయ్య, ముస్తఫా, రమేష్, కిరణ్, సుబ్బారావు పాల్గొన్నారు.

# నార్వాయపేటలో కాంగ్రెస్‌కు భారీ చేరికలు..





- నార్వాయపేటలో కాంగ్రెస్‌లో భారీ చేరికలు..
- ఎమ్మెల్యే వినోద్ సమక్షంలో కండువా కప్పిన నాయకులు..
- బీఆర్ఎస్‌కు షాక్.. కాంగ్రెస్‌కు బలం..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 1 (సిరి న్యూస్)**

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమక్షంలో నెన్నెల్ మండలం నార్వాయపేటలో భారత రాష్ట్ర సమితి పార్టీకి చెందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, యువకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ చేరికలతో నెన్నెల్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందని నాయకులు పేర్కొన్నారు. నెన్నెల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గట్టు మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. నార్వాయపేట సర్పంచ్ కుంసోత్ నారాయణ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ, నార్వాయపేట గ్రామం నుంచి పార్టీ నిర్ణయాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరిన ప్రతి ఒక్కరికీ స్వాగతం పలికారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్నదే తన సంకల్పమని, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు కలిసి ముందడుగు వేస్తే గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గట్టు మల్లేష్, పార్టీ కార్యదర్శి సుంకరి శ్రీనివాస్, గుండ్ల సోమారం సర్పంచ్ సంగతి రాణి తిరుపతి, గంగారం సర్పంచ్ జాడి రాజ్‌కుమార్, కృష్ణపల్లి సర్పంచ్ గంగారం, నెన్నెల్ సీనియర్ నాయకులు మల్లాగౌడ్, తరచంద్, నెన్నెల్ మాజీ సర్పంచ్ తోట శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోలేటి సంధ్య, జనగామ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుడి వేషంలో బోగస్ డాక్టర్..

- నకిలీ డాక్టర్ బండారం బట్టబయలు..
- కుత్బుల్లాపూర్ లో ఏడాదిగా అక్రమ క్లినిక్ నిర్వహణ..
- ప్రత్యేక నిఘా దాడిలో పట్టుబడ్డ బోగస్ వైద్యుడు..
- పోలీసుల వలలో నకిలీ వైద్యుడు..






**కుత్బుల్లాపూర్, సిరి న్యూస్ ప్రతినిధి ఆగస్టు 1:**

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మరో బోగస్ వైద్యుడి గుట్టును కుత్బుల్లాపూర్ పోలీసులు రట్టు చేశారు. వైద్య విద్యార్హతలు, వైద్య మండలి నమోదు, చట్టబద్ధమైన అనుమతులు ఏవీ లేకుండానే తాను వైద్యుడినని నమ్మిస్తూ ఏడాది కాలంగా అక్రమంగా క్లినిక్ నిర్వహించి అమాయక ప్రజల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్న నకిలీ వైద్యుడిని సూరారం పోలీసులు, కుత్బుల్లాపూర్ ప్రత్యేక నిఘా బృందం సంయుక్తంగా దాడి చేసి అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు సూరారం పరిధిలోని వెంకటరామ్ నగర్‌లో బచ్‌పన్ పాఠశాల సమీపంలో నిర్వహిస్తున్న రక్షిత క్లినిక్పై సూరారం పోలీసులు, కుత్బుల్లాపూర్ ప్రత్యేక నిఘా బృందం ఆకస్మిక దాడి నిర్వహించారు. క్లినిక్ నిర్వాహకుడు సనాది కర్ణాకర్ (35), తండ్రి రాజయ్య, సిద్ధిపేట జిల్లా వాసిగా గుర్తించారు. పోలీసుల విచారణలో సనాది కర్ణాకర్‌కు ఎలాంటి వైద్య డిగ్రీ, వైద్య మండలి నమోదు, వైద్య వృత్తి నిర్వహణకు అవసరమైన అనుమతులు లేకపోయినా, తాను అర్హత కలిగిన వైద్యుడినంటూ ప్రజలను నమ్మించి గత ఏడాది కాలంగా అక్రమంగా క్లినిక్ నిర్వహిస్తున్నట్లు బయటపడింది. రోగులను పరీక్షించి మందులు ఇవ్వడం, చికిత్స పేరుతో సలహా రుసుము, మందుల ఖర్చు వసూలు చేస్తూ అమాయక ప్రజల ఆరోగ్యంతో పాటు వారి ప్రాణాలను సైతం ప్రమాదంలోకి నెట్టినట్లు పోలీసులు గుర్తించారు. దాడిలో క్లినిక్‌లో చికిత్సకు సంబంధించిన పలు సామగ్రి, మందులు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు సనాది కర్ణాకర్‌ను అదుపులోకి తీసుకుని సూరారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అతనిపై సంబంధిత చట్టాల ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు కీలక సూచనలు చేశారు. వైద్య సేవలు పొందే ముందు సంబంధిత వైద్యుడికి చెల్లుబాటు అయ్యే వైద్య అర్హతలు, వైద్య మండలి నమోదు, చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయో లేదో తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని కోరారు. తమ ప్రాంతాల్లో నకిలీ వైద్యులు లేదా అక్రమంగా క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు..

# శిథిల భవనాల తొలగింపుపై తహసీల్దార్ తనిఖీలు..

- పాఠశాలల్లో పారిశుద్ధ్య పరిశీలన ...
- విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన తహసీల్దార్..

**హత్నూర, ఆగస్టు 01,(సిరి న్యూస్)**



హత్నూర మండల తహసీల్దార్ ఫర్హీన్ షేక్ శనివారం హత్నూర, దేవులపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పలు అంశాలను పరిశీలించారు. హత్నూర గ్రామంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించిన తహసీల్దార్, శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను పరిశీలించి వాటిని తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ, శానిటేషన్ పరిస్థితులను తనిఖీ చేసి విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అక్కడ అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, అందిస్తున్న ఆహారం నాణ్యత, రుచి, పరిశుభ్రతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటశాల నిర్వహణ, ఆహార పదార్థాల నాణ్యత విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందికి సూచించారు. దేవులపల్లి గ్రామంలోని పాఠశాలను సందర్శించిన అక్కడ కూడా శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న భవనాలను తొలగించి విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# సీజనల్ పండ్లతో హెల్దీగా



పండ్లు తినడానికి సీజన్‌తో పనిలేదు. కానీ, చాలామంది అన్ని కాలాల్లో పండ్లు తినడానికి ఇష్టపడరు. అయితే, సీజనల్‌గా వచ్చే పండ్లు ఆ సీజన్‌లో కచ్చితంగా తినాలి అని నిపుణులు ఆయా సందర్భాల్లో చెప్తుంటారు. అయినా కూడా వానాకాలంలో చాలామంది పండ్లు తినడానికి ఆసక్తి చూపించరు. దానివల్ల అనారోగ్యాలు కొనితెచ్చుకుంటారు. దానిబదులు ఆ సీజన్‌లో దొరికే పండ్లు తింటే ఆరోగ్యానికి చాలా మంచిది.

### జామ

జామపండు తినడం వల్ల కిడ్నీలో రాళ్లు వచ్చే అవకాశాలు తక్కువ. ఇందులో సోడియం, పొటాషియం పాళ్లు సమతూకంగా ఉంటాయి. ముఖ్యంగా హైపర్‌టెన్షన్‌కు గురికాకుండా బ్లడ్ ప్రెషర్‌ను కంట్రోల్ చేస్తుంది. దీంతో గుండె సంబంధిత సమస్యలు రావు. జామలో పీచుపదార్థం అధికంగా ఉంటుంది. అందుకే బరువు తగ్గాలనుకునేవారి డైట్‌లో జామపండు తప్పనిసరి. అంతేకాదు ముఖం మీద ఉండే నల్లటి మచ్చలు తగ్గిపోతాయి. జుట్టు పెరుగుతుంది.

### దానిమ్మ

ఈ కాలంలో విరివిగా దొరికే పండు దానిమ్మ. దానిమ్మ గింజల్లో ఉండే మెడిసినల్ వ్యాల్యూస్ ఉంటాయి. అవి అంటువ్యాధులను తట్టుకునేలా శరీరానికి ఇమ్యూనిటీనిస్తాయి. మెదడుకు రక్తప్రసరణ సాఫీగా జరిగేలా చేసి, దాని పనితీరును మెరుగుపరుస్తాయి. దీంతో పాటు అతిసారం, గుండెజబ్బులు, రక్తహీనత, రక్తపోటు వంటి వ్యాధులను అరికడతాయి. ఇందులో ఎ, సి, ఇ విటమిన్లు ఉంటాయి. అవి చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉంచుతాయి.

### నేరేడు

నేరేడులోని విటమిన్ 'సి' చర్మ ఆరోగ్యానికి, సౌందర్యానికి ఎంతో సహకరిస్తుంది. అజీర్తి, అతిసారం సమస్యలకు చెక్ పెడుతుంది. ఇది గర్భాశయ సమస్యలను తగ్గించడంలో ఉపయోగపడుతుంది. అయితే నేరేడును పరగడుపున తినడం మంచిది కాదు.. అలాగే వీటిని తిన్న వెంటనే పాలు తాగకూడదని నిపుణుల సలహా.

### చెర్రీ :

ఎర్రటి చెర్రీ పండ్లు తింటే అధిక బరువు, పొట్ట భాగంలోని కొవ్వు నుంచి బయటపడొచ్చు. వీటిని ఎక్కువగా తినడం వల్ల వృద్ధాప్య ఛాయలు దరిచేరవు. గుండె ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుతుంది. ఇవి కండరాల నొప్పుల్ని కూడా తగ్గిస్తాయి.

### పియర్

పియర్ పండ్లు వానాకాలంలో ఎక్కువగా వస్తుంటాయి. కానీ, ఇప్పుడు అన్ని కాలాల్లో దొరుకుతున్నాయి. ఇందులో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. పెద్దపేగు క్యాన్సర్‌ను అరికట్టడంతో పాటు కీళ్లనొప్పులను తగ్గించడంలో ఈ పండు సాయపడతుంది.


# రెండో బిడ్డ ఎందుకంటే...

మొదటి బిడ్డ పుట్టిన కొన్నాళ్లకే.. రెండో బిడ్డ ఎప్పుడు? అని మరొక బిడ్డ ఉండాలా వద్దా అని ఆలోచించుకునేందుకు కూడా సమయం ఇవ్వకుండా ఒత్తిడి చేస్తారు ఇంట్లో పెద్దవాళ్లు. కానీ, రెండో బిడ్డను కనడానికి జంట మాత్రం సిద్ధంగా ఉండకపోవడం వల్ల వాళ్లు ఆ ప్రశ్న వేసినప్పుడల్లా ఇబ్బందిగా ఫీలవుతారు. ఏదో ఒక కారణం చెప్పి పక్కకి వెళ్లిపోతారు. అయితే, ఆ విషయం మాత్రం వాళ్లను వెంటాడుతూనే ఉంటుంది. నిర్ణయం తీసుకోవాలంటే ఎవరి సాయం అడగాలో తెలియక దిగులుపడతారు. అలా డైలమాలో ఉన్న జంటలు ఈ విషయాలు ఉపయోగపడతాయి.

ఒకసారి గర్భం దాల్చినప్పుడు కలిగే అసౌకర్యాలన్నీ మొదటి గర్భంలో ఎదుర్కొనే ఉంటారు. ఆహారం, నిద్ర వంటి విషయాల్లో ఎన్నో కొత్త విషయాలను తెలుసుకుని ఉంటారు. వాటివల్ల కలిగే అసౌకర్యాలు తెలిసే ఉంటుంది. కనుక రెండో గర్భంలో చాలా జాగ్రత్తగా ఉంటారు. మొదటి గర్భధారణ సమయంలో గైనకాలజిస్ట్ సలహాలు రెండో గర్భంలో పాటించడానికి వీలవుతుంది. వైద్యపరంగా, రెండవ ప్రసవానికి కూడా ప్రసవ సమయం తక్కువగా ఉంటుంది.

ఆ విషయం పక్కన పెడితే.. ఇద్దరు పిల్లలు ఉన్న ఇల్లు సందడిగా ఉంటుంది. ఆటలు, అల్లరి కలిసే చేస్తారు. పడుకునేప్పుడు కూడా కలిసే పడుకుంటారు. దాంతో తల్లిదండ్రులకు నిద్ర సరిపడా ఉంటుంది. ఒకరికొకరు తోడుగా ఉంటారు. అంతేకాదు.. మరొక బిడ్డ ఉండటం వల్ల ఇద్దరి మధ్యా సన్నిహితంగా అన్ని విషయాలు పంచుకునేలా పెరుగుతారు. ఒకరికి ఒకరు ధైర్యం అవుతారు. చదువులోనూ, ఆటల్లోనూ సపోర్ట్ గా నిలుస్తారు. అలాగే చదువులో కూడా ఇద్దరూ పోటీ పడతారు. చక్కగా చదువుకునే వీలుంటుంది. ఒకరి సామర్థ్యాలు మరొకరికి తెలుస్తాయి. మనసులోని బాధను, సంతోషాన్ని కలిసి పంచుకుంటారు.





# నెక్లెస్ తయారీకి.. 4000 గంటలు!

అనంత్ అంబానీ, రాధిక మర్చంట్ జంట ఇటీవలె పెండ్లితో ఒక్కటయిన సంగతి తెలిసిందే. ఆ రాయల్ వెడ్డింగ్‌లో ఫ్యామిలీలోని ప్రతి ఒక్కరూ ట్రెండ్ సెట్ చేసేలా రెడీ అయ్యారు. అందులో అంబానీ కూతురు ఇషా కూడా ఒకరు. అనంత్ సిస్టర్ ఇషా అంబానీ మనీష్ మల్హోత్రా డిజైన్ చేసిన చీర కట్టుకుంది. దానిపై పింక్, ఆరెంజ్, లైట్ పింక్ పూలతో ఎంబ్రాయిడరీ వర్క్ వచ్చింది. బార్డర్‌లో గోల్డ్ వర్క్ తళుక్కుమనిపించింది. దీనికి థర్డ్ స్లీవ్ మ్యాచింగ్ బ్లౌజ్ వేసుకున్నారు. దీనిని సెలబ్రిటీ స్టైలిస్ట్ అనితా ష్రాఫ్ అడాజానియా స్టైల్ చేశారు. ఇషా చీరని దుపట్టాతో స్టైల్ చేసింది. జరీ, జర్దోసి వర్క్‌తో పాటు మొత్తం దుపట్టా సిల్క్ థ్రెడ్ ఎంబ్రాయిడరీతో హైలైట్ అయింది. చీరలా దుపట్టా కూడా గోటపట్టి, పూల ఎంబ్రాయిడరీతో తయారు చేశారు. ఇక ఇషా ధరించిన నెక్లెస్ విషయానికొస్తే... అనంత్ పెళ్ళి సందర్భంగా ఇషా అంబానీ రేర్ పింక్, బ్లూ, గ్రీన్, ఆరెంజ్ కలర్స్ ఉన్న డైమండ్ నెక్లెస్ ధరించింది. డైమండ్స్‌తో తయారు చేసిన ఈ నెక్లెస్ గార్డెన్ లుక్‌లో ఉంది. ఈ సెట్‌కి డిజైనర్ కాంతిలాల్ ఛాటా లాల్ దానికి 'గార్డెన్ ఆఫ్ లవ్' అని పేరు పెట్టారు. దీన్ని తయారుచేయడానికి వారికి నాలుగు వేల గంటలు పట్టింది.



# నిజమైన విజయం లభించింది

- రవి నంబూరి, శ్రీ గౌరిప్రియ, కిరణ్ అబ్బవరం, ఎస్‌కేఎన్, ధీరజ్

''ఒక సినిమాకు పని చేసిన ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండటమే నిజమైన విజయం. ఆ సక్సెస్ మా 'చెన్నై లవ్‌స్టోరీ'కి లభించింది'' అని కిరణ్ అబ్బవరం అన్నారు. కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరిప్రియ జంటగా నటించిన సినిమా 'చెన్నై లవ్ స్టోరీ'. సాయి రాజేశ్ కథతో రవి నంబూరి ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ నిర్మించిన ఈ సినిమా జూలై 24న విడుదలైంది. ఈ చిత్రం రూ. 50 కోట్ల వసూళ్లు సాధించిందని యూనిట్ పేర్కొంది. శనివారం యూనిట్ నిర్వహించిన రూ. 50 కోట్ల బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ– ''మా 'చెన్నై లవ్‌స్టోరీ' ప్రేమకథా చిత్రం కాబట్టి ఫ్యామిలీ ఆడియన్స్ వస్తారా? అనే సందేహం కలిగింది. ఇటీవల మేం థియేటర్స్ విజిట్ చేశాం. ప్రతి థియేటర్‌లో ఎక్కువ సంఖ్యలో ఫ్యామిలీ ఆడియన్స్ ఉంటున్నారు'' అన్నారు. ''ఒక సినిమాను ఎలా ప్రమోట్ చేయాలో ఈ సినిమా ప్రయాణంలో మా నిర్మాతల నుంచి నేర్చుకున్నాను'' అని తెలి పారు రవి నంబూరి.

''కంటెంట్ బాగుంటే విజయాన్ని అందించడంలో తెలుగు ప్రేక్షకులు ముందుంటారని మా సినిమాతో మరోసారి నిరూపితమైంది'' అని చె□పారు శ్రీగౌరి ప్రియ. ''మా సినిమాకి ఘనవిజయాన్ని అందించిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అని అన్నారు సహ–నిర్మాత ధీరజ్ మొగిలినేని. ''8 రోజుల్లోనే కిరణ్ గారి కెరీర్‌లో ఈ సినిమా బిగ్గెస్ట్ హిట్‌గా నిలవడం హ్యాపీగా ఉంది'' అని చె□పారు ఎస్‌కేఎన్.



# నా క్లిప్పింగ్స్‌తో యువతను తప్పుదోవ పట్టించొద్దు: కంగనా రనౌత్

నటి, భాజపా ఎంపీ కంగనా రనౌత్ ట్రోలర్స్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తన సినిమాల్లోని సన్నివేశాలను చూపిస్తూ విమర్శలు చేస్తోన్న వారికి గట్టి కౌంటర్ ఇచ్చారు. దయచేసి యువతను తప్పదోవ పట్టించొద్దని హితవు పలికారు. ఇటీవల యువతను ఉద్దేశించి కంగనా వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కొందరు హిందూ యువతులు బాధ్యత లేకుండా.. స్వేచ్ఛ పేరిట తిరుగుతున్నారని ఆమె విమర్శించారు. వారిని 'గట్టర్ జనరేషన్' అని వ్యాఖ్యానించారు. దీనిపై సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేగింది. దీంతో కొందరు నెటిజన్లు కంగనా వ్యాఖ్యలను తప్పబడుతూ.. ఆమె సినిమాల్లోని కొన్ని పాత్రలను, పాత వీడియోలను వైరల్ చేశారు.

ఈ ట్రోలింగ్‌పై కంగనా ఇన్‌స్టాలో స్పందించారు. సినిమాల్లో తాను పోషించిన పాత్రలకు, నిజ జీవితానికి ముడిపెట్టొద్దని కోరారు. ''నేను రూ.కోట్లు పారితోషికం తీసుకుని సినిమాల్లో ఆయా పాత్రలు పోషిస్తాను. పెద్ద పెద్ద ఈవెంట్లలో పాల్గొన్నప్పుడు నా చుట్టూ భారీ భద్రత ఉంటుంది. అలాంటి వాటిని ఉదాహరణగా చూపిస్తూ.. పబ్‌లలో, రోడ్ల మీద, ఫంక్షన్లలో కూడా యువత అలాగే ప్రవర్తించొచ్చని అంటారా? ఈ రెండూ ఒకటేనా?. నటిగా నా వృత్తికి తగ్గట్లుగా విభిన్న పాత్రలు పోషిస్తాను. ఈ విషయంలో నేను సిగ్గుపడాల్సింది ఏమీ లేదు. దయచేసి యువతను తప్పదోవ పట్టించకండి. ఇవాళ ఇతరుల పిల్లలను మీరు తప్పదోవ పట్టిస్తే.. రేపు ఆ పరిస్థితి మీ పిల్లలకూ రావచ్చు'' అని కంగనా హెచ్చరించారు.




# అరుదైన మైలురాయిని చేరుకున్న 'రామాయణ'.. ఇది అసలైన బీభత్సమంటే

బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ'. ఈ సినిమా ప్రకటించిన నాటి నుంచే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల మేకర్స్ విడుదల చేసిన ట్రైలర్‌కు అన్ని భాషల్లోనూ విశేష స్పందన లభిస్తోంది. తాజాగా చిత్ర బృందం వెల్లడించిన వివరాల ప్రకారం, 'రామాయణ' ట్రైలర్ అన్ని భాషల్లో కలిపి 350 మిలియన్ల వ్యూస్ దాటింది. దీంతో విడుదలకు ముందే ఈ చిత్రం అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం ఈ ట్రైలర్ యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో రూపొందుతున్న ఈ సినిమాకు డీఎన్‌ఈజీ (DNEG) విజువల్ ఎఫెక్ట్స్ అందిస్తుండగా, ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ సంగీతం సమకూరుస్తున్నారు. సన్నీ డియోల్, రవి దూబే, అరుణ్ గోవిల్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'రామాయణ' పార్ట్ 1ను 2026 దీపావళికి, పార్ట్ 2ను 2027 దీపావళికి విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. ట్రైలర్‌కు లభిస్తున్న అద్భుత స్పందనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.



# 'టాక్సిక్‌లో బోల్డ్ రోల్.. అందుకే ఒప్పుకున్నా'

యశ్ హీరోగా వస్తోన్న లేటేస్ట్ యాక్షన్ మూవీ టాక్సిక్.. ఇప్పటికే రిలీజ్ కావాల్సిన ఈ చిత్రం పలుసార్లు వాయిదా పడింది. ఎట్టకేలకు ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుందని మేకర్స్ ప్రకటించారు. ఈ మూవీకి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో యశ్ సరసన బాలీవుడ్ భామ కియారా అద్వానీ హీరోయిన్‌గా కనిపించనుంది. ఇప్పటికే రిలీజైన టీజర్, సాంగ్స్‌పై పెద్దఎత్తున విమర్శలొచ్చాయి. మరీ బోల్డ్‌గా సీన్స్ ఉన్నాయంటూ పలువురు విమర్శించారు.

తమ సినిమాపై విమర్శల వస్తోన్న నేపథ్యంలో తన రోల్‌పై హీరోయిన్ కియారా అద్వానీ స్పందించింది. తన పాత్రకు సంబంధించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఈ కథ వినగానే ఆ పాత్రకు కనెక్ట్ అయ్యానని తెలిపింది. మహిళలను కేవలం మూసధోరణి పాత్రలే కాకుండా బలంగా, మరింత సహజంగా ఉండాలని పేర్కొంది. అలాంటి అవకాశం ఈ పాత్రలో ఉన్నందుకే వెంటనే ఓకే చెప్పానని కియారా వెల్లడించింది.

ఇలాంటి పాత్ర చేయడం ప్రతి నటికీ ఓ కల అని అన్నారు. నా కెరీర్‌లో ఇలాంటి క్లిష్టమైన పాత్రను పోషించగలననే ధైర్యం కలిగిందని తెలిపారు. నయనతార, హుమా ఖురేషీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్‌లతో కలిసి పనిచేయడం నాకు చాలా కొత్త అనుభూతిని ఇచ్చిందన్నారు. ఇంతమంది ఒకే సినిమాలో కనిపించడం ప్రేక్షకులకు నచ్చుతుందని పేర్కొన్నారు. ఈ సినిమాపై నాకు ఇష్టం కలగడానికి ఇలాంటి క్షణాలే కారణమని వెల్లడించారు.

# ఓటీటీలోకి రాబోతున్న లెనిన్..

అక్కినేని అఖిల్ కెరీర్‌లోనే మొట్టమొదటి బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన భారీ ప్రాజెక్ట్ 'లెనిన్'. భారీ అంచనాల నడుమ జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా, మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి కలెక్షన్ల వర్షం కురిపిస్తూ నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది. ఈ రూరల్ యాక్షన్ డ్రామాలో అఖిల్ సరసన యంగ్ అండ్ గ్లామరస్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించగా, దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై అక్కినేని నాగార్జున, నాగవంశీ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం, థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.100 కోట్ల కలెక్షన్లను రాబట్టి అఖిల్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. అఖిల్ సరికొత్త మాస్ లుక్, మాస్ ఎలిమెంట్స్, పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. థియేటర్లలో సంచలన విజయం సాధించి రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన ఈ మాస్ యాక్షన్ డ్రామా, ఇప్పుడు ఓటీటీ ప్రియులను అలరించేందుకు సిద్ధమైంది. ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 దక్కించుకుంది. ఈ క్రమంలోనే 'లెనిన్' చిత్రాన్ని రాబోయే ఆగస్టు 7వ తేదీ నుంచి తమ ప్లాట్‌ఫామ్‌లో డిజిటల్ స్ట్రీమింగ్‌కు తీసుకురాబోతున్నట్లు ఒక స్పెషల్ ప్రోమో వీడియో ద్వారా మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. ఈ పోస్ట్‌కు గర్జన మొదలవుతోంది.ప్రేమ, ప్రతీకారం, విప్లవాల కథ మీ తెరలను అలరించడానికి సిద్ధంగా ఉంది. లెనిన్ ఆగస్టు 7న, ప్రత్యేకంగా తెలుగు జీ5లో ప్రసారం కానుంది'' అని రాసుకొచ్చారు. థియేటర్లలో మిస్ అయినవారు, మళ్లీ చూడాలనుకునేవారు జీ5లో ఈ బ్లాక్‌బస్టర్ హిట్ సినిమాను చూడొచ్చు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

www.siridaily.com
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్తపత్రిక
ఆదివారం
ఆగస్టు-02-2026
సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 203
MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 5

## అత్యంత వైభవంగా గీతం 17వ స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి
- 1990 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం
- 17 మంది ప్రతిభావంతులకు బంగారు పతకాలు
- చేనేత కళాకారుడు గజం గోవర్ధన్‌కు గౌరవ డాక్టరేట్
- పట్టభద్రులకు రాజమౌళి స్ఫూర్తిదాయక సందేశం
- పెద్ద లక్ష్యాలతో ముందుకు సాగాలి: శ్రీభరత్

5










## దేవేందర్ రెడ్డి బాధ్యతల స్వీకారంతో
# ‘కోనాపూర్’ ప్రగతి!

### 108 సొసైటీలలో ‘ఏ’ గ్రేడ్ స్థానంలో..

- పనితీరును బట్టి సహకార సంఘాలకు గ్రేడులు
- రూ. 30 లక్షల నుండి వార్షిక ఆదాయం ఏకంగా రూ. 40 కోట్లకు పెంపు
- నూటికి నూరు శాతం రుణాలు వసూలు చేసిన ఘనత
- రైతుల సంక్షేమం కోసం వినూత్న సంస్కరణల అమలు
- ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయంతో కొత్త ఉత్సాహం
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాల అందజేత
- దేవేందర్ రెడ్డి చొరవతో సొసైటీలో ఎఫ్‌డీల వరద
- శాశ్వత ప్రాతిపదికన ఆస్తులు, మౌలిక వసతులు
- 400 గ్రామాలకు సేవలు.. స్థానికులకు నిత్య ఉపాధి
- ఏ సొసైటీ చేయని వినూత్న కార్యక్రమాలతో ముందుకు

4
రేపటి సంచికలో మరో

సాధారణంగా ప్రాథమిక సహకార సంఘాల పనితీరు, నిర్వహణ, ఆర్థిక క్రమశిక్షణను బట్టి మార్కులు కేటాయించి ఏ, బీ, సీ గ్రేడులుగా వర్గీకరిస్తారు. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 108 ప్రాథమిక సహకార సంఘాలు ఉండేవి. అయితే అందులో ఉన్న అన్ని సహకార సంఘాలు నామమాత్రపు లావాదేవీలతో సి గ్రేడ్‌కే పరిమితమయ్యాయి. ఈ క్రమంలో 2005లో కోనాపూర్ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా దేవేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2007 నాటికి సీఈఓ, సొసైటీ సభ్యుల భాగస్వామ్యంతో రాత్రింబవళ్లు శ్రమించి, ‘సి’ గ్రేడ్‌లో పడివున్న కోనాపూర్ సొసైటీని ఏకంగా ‘ఏ’ గ్రేడ్ స్థాయికి తీసుకువచ్చి చరిత్ర సృష్టించారు.

(ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్)

## ఆందోల్ నియోజకవర్గంలో
# 99 శాతం సర్ ప్రక్రియ పూర్తి

- కష్టపడి పనిచేసిన బీఎల్ఏలకు మంత్రి ప్రశంసలు
- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలి
- మంత్రి దామోదర్ రాజనర్సింహ బూత్ లెవెల్ ఏజెంట్లకు పిలుపు
- త్వరలో బూత్ లెవెల్ ఏజెంట్లకు అభినందన సభ

సంగారెడ్డి, ఆగస్టు 1 (సిరిన్యూస్) : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతంపై ఆందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి, రాయికోడ్, ఆందోల్, పుల్కల్ , చౌటకూర్, రేగోడ్, రాయికోడ్ , వట్పల్లి, అల్లాదుర్గ్ మండలాల బీఎల్ఏలు , మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులతో సంగారెడ్డిలోని తన నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో బీఎల్ఏలు ఎంతో కష్టపడి 99 శాతం విజయవంతం చేశారన్నారు.

2





## ప్రజా పోరాటాల నుంచి
# పార్టీ సేవ వరకు!

### ఆరుట్ల నుంచి ప్రారంభమైన కాసాల బుచిరెడ్డి ప్రయాణం

- రామజన్మభూమి ఉద్యమంలో చురుకైన భాగస్వామ్యం
- ఆల్ కబీర్ ఉద్యమాల్లో కీలక పాత్ర
- సహకార రంగంలో విశేష సేవలందించిన అనుభవశాలి
- స్థానిక సంస్థల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన రికార్డు
- రెండు జిల్లాల బీజేపీ అధ్యక్షుడిగా సేవలు
- పలువురు కీలక నేతలను పార్టీలోకి తెచ్చిన ధీరుడు
- మంత్రి హరీశ్ రావు ఆహ్వానంతో బీఆర్ఎస్‌లోకి చేరిక
- సీడీసీ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వ నామినేటెడ్ పదవి
- ప్రస్తుతం దుబ్బాక డిజిటల్ సభ్యత్వ సమన్వయకర్తగా బాధ్యతలు
- ఉద్యమ నేపథ్యం నుంచి రాజకీయ అరంగేట్రం



3

# ఆందోల్ నియోజకవర్గంలో 99 శాతం సర్ ప్రక్రియ పూర్తి

- కష్టపడి పనిచేసిన బీఎల్ఏలకు మంత్రి ప్రశంసలు
- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలి
- మంత్రి దామోదర్ రాజనర్సింహ బూత్ లెవెల్ ఏజెంట్లకు పిలుపు
- త్వరలో బూత్ లెవెల్ ఏజెంట్లకు అభినందన సభ





సంగారెడ్డి, ఆగస్టు 1 (సిరిన్యూస్) : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతంపై ఆందోల్ నియోజకవర్గంలోని మునిపల్లి, రాయికోడ్, ఆందోల్, పుల్కల్, చౌటకూర్, రేగోడ్, రాయికోడ్, వట్పల్లి, అల్లాదుర్గ్ మండలాల బీఎల్ఏలు, మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులతో సంగారెడ్డిలోని తన నివాసంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో బీఎల్ఏలు ఎంతో కష్టపడి 99 శాతం విజయవంతం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ బూతు లెవెల్ ఏజెంట్స్ బూతుల వారిగా నమోదు కాని ఓటర్లు వివరాలు వెంటనే సేకరించి 100 శాతం సర్‌ను నియోజకవర్గంలో పూర్తి చేయాలని కోరారు. ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్ లకు అందించి ఓటు నమోదు కు అవసరమైన సహాయం అందించాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని కోరుకున్నారు. అందుకు అవసరమైన అవగాహనను ఓటర్లకు కల్పించేలా కృషి చేయాలన్నారు. ఓటర్ల తో సమన్వయ చేసుకొని గడువులోగా సర్ ప్రక్రియను 100 శాతం పూర్తిచేసి ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ కోసం బూత్ లెవెల్ అధికారులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డాక్టర్స్ సెల్ చైర్మన్ డాక్టర్ రాజీవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, జోగిపేట మున్సిపాలిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, ఆందోల్ నియోజకవర్గం లోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిల్లోడి సతీష్, బాలాజీ నరసింహులు, దుర్గారెడ్డి, దశరథ్, రమేష్ జోషి, శివరాజ్, శేషారెడ్డి, దిగంబర్ రావు, రమేష్ లు, మాజీ చైర్మన్ మల్లయ్య, కౌన్సిలర్స్, ఇతర ప్రజా ప్రతినిధులు, సర్పంచ్ లు, ముఖ్య నాయకులు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.


## సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై మంత్రి దామోదర్ సమీక్ష

సంగారెడ్డి, ఆగస్టు 1 (సిరిన్యూస్) : రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు సంగారెడ్డి లోని తన నివాసంలో ఆందోల్ నియోజకవర్గం లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు, నూతనంగా నిర్మించనున్న ప్రతిపాదిత ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కు అవసరమైన స్థల పరిశీలనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో నియోజకవర్గ పరిధిలో నూతనంగా నిర్మించనున్న లా కాలేజీ, తహసిల్దార్, పోలీస్ స్టేషన్, ఎంపీడీవో, పీహెచ్సీల ప్రతిపాదిత భవనాలకు స్థల సేకరణ, పరిశీలన పై రెవెన్యూ అధికారులతో మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, నియోజక వర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు, భూ భారతి కార్యక్రమం లో ప్రజలు చేసుకున్న దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయడంపై జిల్లా అదనపు కలెక్టర్ పాండు, డీఎంహెచ్వో డాక్టర్ లలిత దేవి, సంగారెడ్డి, ఆందోల్ ఆర్డీవోలు రాజేందర్, రమేష్ కుమార్, ఆందోల్ నియోజకవర్గ పరిధిలోని తహసిల్దార్లతో మంత్రి చర్చించారు. సంగారెడ్డి జిల్లాలో ఫీవర్ సర్వే, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ఆసుపత్రులలో శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ, అన్ని ఆసుపత్రులలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నిరంతరం అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.



# ఆగస్టు 10 వరకు ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు అవకాశం

- ప్రతి అర్హత గల ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





సంగారెడ్డి, ఆగస్టు 1: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువును భారత ఎన్నికల సంఘం ఆగస్టు 10, 2026 వరకు పొడిగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటన లో తెలిపారు. ఈ మేరకు ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసిందని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా తమ ఫారాలను సమర్పించాలని కోరారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ 78 శాతం పూర్తయిందని తెలిపారు. ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆగస్టు 10లోపు తమ ఫారాలను సంబంధిత బీఎల్‌వోలకు తప్పనిసరిగా సమర్పించాలని కోరారు. అలాగే పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కూడా ఆగస్టు 10 నాటికి పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17, 2026న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, అదే రోజు నుంచి సెప్టెంబర్ 16 వరకు ఓటర్లు క్లెయిమ్స్, అభ్యంతరాలను సమర్పించవచ్చని తెలిపారు. స్వీకరించిన క్లెయిమ్స్, అభ్యంతరాలను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలించి ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు పరిష్కార ప్రక్రియ చేపట్టనున్నట్లు, అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా ప్రచురించబడుతుందని వెల్లడించారు. జిల్లాలో ప్రతి అర్హుడైన ఓటరు పేరు తప్పనిసరిగా ఓటరు జాబితాలో ఉండాలన్నారు. బీఎల్‌వోలు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు పరస్పర సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్ణీత గడువులోపు అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

# కేసీఆర్ నగర్ లో కార్డన్ సెర్చ్

- 49 బైకులు, 3 ఆటోలు సీజ్
- 18.65 లీటర్ల మద్యం స్వాధీనం

సిద్దిపేట, ఆగస్టు 1 : సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసీఆర్ నగర్ లో ఏసీపీ రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో శనివారం పోలీసులు విస్తృత 'కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్' నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా బ్లాకులను క్షుణ్ణంగా సోదా చేసిన పోలీసులు, సరైన ధ్రువపత్రాలులేని 49 బైక్‌లు, 3ఆటోలను సీజ్ చేశారు. రెండు బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేసి, 18.65 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాల్లో డాగ్ స్క్వాడ్ సేవలను కూడా వినియోగించారు. సిద్దిపేట వన్ టౌన్, టూటౌన్, రూరల్, దుబ్బాక సీఐలు మహేందర్ రెడ్డి, మురళి, విద్యాసాగర్, రాజేష్, 14 మంది ఎస్ఐలు, వంద మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# ప్రజా పోరాటాల నుంచి పార్టీ సేవ వరకు!

## ఆరుట్ల నుంచి ప్రారంభమైన కాసాల బుచిరెడ్డి ప్రయాణం

- రామజన్మభూమి ఉద్యమంలో చురుకైన భాగస్వామ్యం
- ఆల్ కబీర్ ఉద్యమాల్లో కీలక పాత్ర
- సహకార రంగంలో విశేష సేవలందించిన అనుభవశాలి
- స్థానిక సంస్థల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన రికార్డు
- రెండు జిల్లాల బీజేపీ అధ్యక్షుడిగా సేవలు
- పలువురు కీలక నేతలను పార్టీలోకి తెచ్చిన ధీరుడు
- మంత్రి హరీష్ రావు ఆహ్వానంతో బీఆర్ఎస్‌లోకి చేరిక
- సీడీసీ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వ నామినేటెడ్ పదవి
- ప్రస్తుతం దుబ్బాక డిజిటల్ సభ్యత్వ సమన్వయకర్తగా బాధ్యతలు
- ఉద్యమ నేపథ్యం నుంచి రాజకీయ అరంగేట్రం

**సంగారెడ్డి జిల్లా కంది మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన కసల బుచిరెడ్డి చిన్ననాటి నుంచే ప్రజా సమస్యలపై, ధార్మిక ఉద్యమాలపై ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. 1990లో శివాజీ అధ్యక్షతన జరిగిన రామజన్మభూమి ఉద్యమ సమయంలో ఆరుట్ల గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ రామశిల పూజలు నిర్వహించి అయోధ్యకు పంపించడంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత 1991 లోక్‌సభ ఎన్నికల్లో ఆరుట్ల గ్రామాధ్యక్షుడిగా, బిజెపి అభ్యర్థి ఏ. కిషన్ రావుకు పోలింగ్ ఏజెంట్‌గా వ్యవహరించి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1992 నుంచి 1994 మధ్య కాలంలో విహెచ్‌పి ఆధ్వర్యంలో ఆల్ కబీర్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా జరిగిన భారీ ఉద్యమంలో ముందుపీఠిన నిలిచారు. 1994 ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఎన్నికల్లో సంగారెడ్డి బిజెపి అభ్యర్థి పి. వీరారెడ్డి విజయం కోసం క్షేత్ర స్థాయిలో తీవ్రంగా శ్రమించారు.**

(ప్రత్యేక ప్రతినిధి-సిరిన్యూస్)



### ప్రస్తుత రాజకీయ బాధ్యతలు, భవిష్యత్ కార్యాచరణ

2024పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకటరామిరెడ్డి విజయం కోసం పని చేయడంతో పాటు, స్థానిక సర్పంచ్ మరియు మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కర్తగా వ్యవహరించారు. పార్టీ పట్ల అంకిత భావం, పక్కా ప్రణాళికతో పనిచేసే నేర్పరితనం కలిగిన కసల బుచిరెడ్డిని బిఆర్ఎస్ అధిష్టానం ప్రస్తుతం దుబ్బాక నియోజకవర్గ డిజిటల్ సభ్యత్వ నమోదు సమన్వయకర్తగా నియమించింది. క్షేత్రస్థాయి నుంచి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకుడిగా, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి ఆయన తనవంతు కృషి కొనసాగిస్తున్నారు.

### సహకార రంగ ప్రవేశం.. స్థానిక పాలన

రాజకీయాల్లో క్రమంగా ఎదుగుతూ 1995 జూలైలో జరిగిన పీఏసీఎస్ ఎన్నికల్లో ఆరుట్ల గ్రామం నుంచి డైరెక్టర్‌గా గెలిచి, ఇస్మాయిల్ ఖాన్ పేట సొసైటీకి వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 1996లో బిజెపి కిసాన్ మోర్చా సంగారెడ్డి మండల అధ్యక్షుడిగా నియామకమయ్యారు. 1996, 1998 మరియు 1999లలో జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి ఏ. నరేంద్ర, ఎమ్మెల్యే అభ్యర్థి కే. సత్యానారాయణల విజయానికి మండల స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. 2000 సంవత్సరంలో బిజెపి సంగారెడ్డి మండల ప్రధాన కార్యదర్శిగా, 2003లో మండల అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో పాటు సదాశివపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 2006లో ఆరుట్ల సర్పంచ్ స్థానం ఎస్సీ రిజర్వ్ కావడంతో, గ్రామస్తుల సహకారంతో ఏకగ్రీవంగా ఉప సర్పంచ్‌గా ఎన్నికై 2013 వరకు ఆ పదవిలో ప్రజాసేవ అందించారు.

### సంస్థాగత నిర్మాణం.. జిల్లా అధ్యక్షుడిగా రికార్డు

2007లో బిజెపి సంగారెడ్డి నియోజకవర్గ కన్వీనర్‌గా, 2010లో మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పదోన్నతి పొందారు. నిజామాబాద్, పరకాల, మహబూబ్‌నగర్ ఉపఎన్నికల్లో ఇన్చార్జిగా వ్యవహరించి పార్టీ విజయాలలో భాగస్వామ్యమయ్యారు. 2013లో ఉమ్మడి మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షుడిగా ఎన్నికై, 2014 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఉమర్గా నియోజకవర్గ ఇన్చార్జిగా సేవలందించారు. 2014 సార్వత్రిక ఎన్నికల సమయంలో పటాన్‌చెరు స్థానం పొత్తుల్లో భాగంగా టిడిపికి వెళ్లడంతో, పార్టీ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడి హోదాలో అనేక సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఎం.రఘునందన్ రావు, సీ. అంజిరెడ్డి, ఆకుల రాజయ్య వంటి కీలక నేతలను బిజెపిలోకి ఆహ్వానించి చేర్పించారు. మెదక్ పార్లమెంట్ ఉపఎన్నికల్లో జగ్గారెడ్డిని పార్టీలోకి తెచ్చి అభ్యర్థిగా నిలిపి ఆయనకు ఎలక్షన్ ఏజెంట్‌గా వ్యవహరించారు. 2016 నవంబర్‌లో నూతనంగా ఏర్పాటైన సంగారెడ్డి జిల్లా తొలి బిజెపి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.



### బీఆర్ఎస్ పార్టీలోకి చేరిక.. నామినేటెడ్ పదవులు

**2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా బిజెపికి రాజీనామా చేసిన బుచిరెడ్డి, నాటి జిల్లా మంత్రి తన్నీరు హరీష్ రావు, ప్రస్తుత ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆహ్వానం మేరకు టిఆర్ఎస్ (ప్రస్తుతం బిఆర్ఎస్) లో చేరారు. పార్టీలోకి వచ్చిన అనతికాలంలోనే తన మార్కు రాజకీయం చూపిస్తూ 2019 పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు రాత్రింబవళ్లు శ్రమించారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 2020 జూన్‌లో ఆయనను సీడీసీ చైర్మన్‌గా నియమించింది. దుబ్బాక, మునుగోడు ఉపఎన్నికల్లో నియోజకవర్గ, వార్డు ఇన్చార్జిగా పార్టీ విజయాల కోసం పనిచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ ఎలక్షన్ ఏజెంట్‌గా వ్యవహరించి ఆయన విజయంలో కీలక పాత్ర పోషించారు.**




రేపటి సంచికలో మరో కథనం

# దేవేందర్ రెడ్డి బాధ్యతల స్వీకారంతో 'కోనాపూర్' ప్రగతి!

- పనితీరును బట్టి సహకార సంఘాలకు గ్రేడులు
- రూ. 30 లక్షల నుండి వార్షిక ఆదాయం ఏకంగా రూ.40 కోట్లకు పెంపు
- నూటికి నూరు శాతం రుణాలు వసూలు చేసిన ఘనత
- రైతుల సంక్షేమం కోసం వినూత్న సంస్కరణల అమలు
- ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయంతో కొత్త ఉత్సాహం
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాల అందజేత
- దేవేందర్ రెడ్డి చొరవతో సొసైటీలో ఎఫ్డీల వరద
- శాశ్వత ప్రాతిపదికన ఆస్తులు, మౌలిక వసతులు
- 400 గ్రామాలకు సేవలు.. స్థానికులకు నిత్య ఉపాధి
- ఏ సొసైటీ చేయని వినూత్న కార్యక్రమాలతో ముందుకు

## 108 సొసైటీలలో 'ఏ' గ్రేడ్ స్థానంలో..

**(ప్రత్యేక ప్రతినిధి-సిరి న్యూస్): సాధారణంగా ప్రాథమిక సహకార సంఘాల పనితీరు, నిర్వహణ, ఆర్థిక క్రమశిక్షణను బట్టి మార్కులు కేటాయించి ఏ, బీ, సీ గ్రేడులుగా వర్గీకరిస్తారు. గతంలో ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 108 ప్రాథమిక సహకార సంఘాలు ఉండేవి. అయితే అందులో ఉన్న అన్ని సహకార సంఘాలు నామమాత్రపు లావాదేవీలతో సి గ్రేడ్‌కే పరిమితమయ్యాయి. ఈ క్రమంలో 2005లో కోనాపూర్ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా దేవేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2007 నాటికి సీఈఓ, సొసైటీ సభ్యుల భాగస్వామ్యంతో రాత్రింబవళ్లు శ్రమించి, 'సి' గ్రేడ్‌లో పడివున్న కోనాపూర్ సొసైటీని ఏకంగా 'ఏ' గ్రేడ్ స్థాయికి తీసుకువచ్చి చరిత్ర సృష్టించారు.**

### రూ. 30 లక్షల నుండి రూ. 40 కోట్లకు చేరిన ఆదాయం...

2005 నాటికి కోనాపూర్ సొసైటీ వార్షిక ఆదాయం కేవలం రూ.30 లక్షలుగా మాత్రమే ఉండేది. దేవేందర్ రెడ్డి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే ప్రణాళికాబద్ధమైన వ్యాపార పద్ధతులతో వార్షికాదాయాన్ని ఏకంగా రూ.40 కోట్లకు తీసుకెళ్లారు. సొసైటీ మనుగడ సాగించాలంటే ఇచ్చిన రుణాలు సకాలంలో తిరిగి రావడం కీలకమని గుర్తించి, 100 శాతం లోన్ రికవరీ సాధించేలా కొత్త సంస్కరణలను అమల్లోకి తెచ్చారు. రికవరీ పెంచడానికి కఠినమైన నిబంధనలతో పాటు రైతులను ప్రోత్సహించేలా వినూత్న సంక్షేమ పథకాలను కల్పించారు.

### క్రమశిక్షణతో కూడిన సంక్షేమ నిబంధనలు..

నూటికి నూరు శాతం రుణాలు సకాలంలో చెల్లించే సభ్యులకే వివిధ రకాల లాభాలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా నిబంధన ప్రకారం 100శాతం రుణాలు చెల్లించని వారికి ఎలాంటి డివిడెండ్ ఇవ్వకూడదని కఠిన నిర్ణయం తీసుకున్నారు. అదే సమయంలో క్రమం తప్పకుండా రుణాలు చెల్లించే రైతుల కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లి జరిగితే, పెళ్లిరోజే నేరుగా పెళ్లి పందిరిలోనే రూ. 6వేల నగదును సొసైటీ తరఫున అందజేశారు. ఒకవేళ రుణాలు క్రమంగా చెల్లిస్తూ ఉన్న క్రమంలో ఏదేని సభ్యుడు చనిపోతే, ఆ కుటుంబానికి తక్షణ ఊరటగా రూ. 5వేలు అంత్యక్రియల సహాయార్థం చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. ఇలా కఠినమైన నిబంధనలు పెట్టడం వల్ల సొసైటీ మంచి లాభాల్లో పయనించింది.

### బాల్యవివాహాలకు అడ్డుకట్ట.. సర్కారు బడులకు ప్రోత్సాహం

సొసైటీ ద్వారా అమలు చేసిన ఈ సంస్కరణలు సామాజిక మార్పునకు కూడా శ్రీకారం చుట్టాయి. అప్పట్లో గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని బాల్యవివాహాలు జరిగేవి. అయితే అమ్మాయికి మేజర్ వయస్సు నిండిన తర్వాతే పెళ్లి చేస్తే ఈ రూ. 6వేల నగదు ప్రోత్సాహకం వర్తిస్తుందని కఠిన నిబంధన పెట్టడంతో, బాల్యవివాహాలు గణనీయంగా తగ్గి అడ్డుకట్ట పడింది. అలాగే ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సర్కారు బడుల్లో చదువుతూ మొదటి మార్కులు సాధించిన విద్యార్థులకు రూ. 1,000, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ. 500 చొప్పున సొసైటీ ద్వారా బహుమతులు అందిస్తూ ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెరిగేటట్టు చేశారు.

### సొసైటీలో ఎఫ్డీల సంస్కృతికి శ్రీకారం

ఇలాంటి వినూత్న సంస్కరణలు ఉమ్మడి జిల్లాలోని ఏ ఇతర సహకార సొసైటీలో కూడా చేయలేదని, కేవలం కోనాపూర్ సొసైటీలో దేవేందర్ రెడ్డి మాత్రమే చేసి చూపించారని స్థానికులు చెబుతున్నారు. సొసైటీ నిధుల బలోపేతానికి ఫిక్స్డ్ డిపాజిట్ల సంస్కృతిని తెచ్చి, మొదట చైర్మన్ దేవేందర్ రెడ్డి సొంతంగా రూ. 2 లక్షలు ఎఫ్డీ చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. ఆయన చొరవతో ప్రోత్సహించబడిన మిగతా రైతులు, సభ్యులు కూడా సొసైటీలో ఎఫ్డీలు చేసేందుకు ముందుకు వచ్చారు.

### శాశ్వత ప్రాతిపదికన ఆస్తులు, మౌలిక వసతులు

సొసైటీకి నిరంతరం లాభాలు వచ్చేలా విలువైన శాశ్వత ఆస్తులను సమకూర్చడంలో చైర్మన్ దేవేందర్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. ధాన్య నిల్వ కోసం 1,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల భారీ గోదామును నిర్మించారు. వాణిజ్యపరమైన ఆదాయం కోసం ఆరు మరియు పది విభాగాలుగా మొత్తం 16 షెట్టర్లతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించి, ప్రతి నెల సొసైటీకి శాశ్వత అద్దె ఆదాయం వచ్చేలా ఏర్పాటు చేశారు. వీటితో పాటు సొసైటీ ఆధ్వర్యంలోనే ఒక పెట్రోల్ బంక్‌ను స్థాపించి, దాని ద్వారా మరో 8 మంది స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించడమే కాకుండా సొసైటీకి మరొక రెగ్యులర్ ఆదాయ మార్గాన్ని సృష్టించారు.

### 400 గ్రామాలకు సేవలు.. స్థానికులకు నిత్య ఉపాధి..

వ్యాపార విస్తరణలో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా ఏకంగా 400 గ్రామాలకు, 6 జిల్లాలకు యూరియా మరియు ఎరువుల సప్లై బాధ్యతలను కోనాపూర్ సొసైటీ ద్వారా విజయవంతంగా నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు దగ్గర చేసేందుకు సొసైటీ ఆధ్వర్యంలోనే 'మీ సేవా' కేంద్రాన్ని ఏర్పాటు చేసి చుట్టుపక్కల 36 గ్రామాల ప్రజలకు నిత్యం సేవలు అందుబాటులోకి తెచ్చారు. గతంలో కేవలం ఇద్దరు ఉద్యోగులతో ఉన్న ఈ సొసైటీలో ఉద్యోగుల సంఖ్యను 16 మందికి పెంచి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసానిచ్చారు. అంతేకాకుండా ప్రతిరోజూ సొసైటీ పనుల ద్వారా సొంత ఊరిలోని ఆరుగురు హమాలీలకు నిత్య ఉపాధి కల్పించి, కోనాపూర్ సొసైటీని ఒక ఆదర్శవంతమైన మోడల్‌గా తీర్చిదిద్దారు.




# అత్యంత వైభవంగా గీతం 17వ స్నాతకోత్సవం

## ముఖ్య అతిథిగా దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి

## 1990 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం

## 17 మంది ప్రతిభావంతులకు బంగారు పతకాలు

## చేనేత కళాకారుడు గజం గోవర్ధన్‌కు గౌరవ డాక్టరేట్

## పట్టభద్రులకు రాజమౌళి స్ఫూర్తిదాయక సందేశం

## పెద్ద లక్ష్యాలతో ముందుకు సాగాలి: శ్రీభరత్

పటాన్ చేరు, ఆగస్టు 1 (సిరి న్యూస్): హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 17వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ముఖ్య అతిథిగా హాజరుకాగా, గీతం అధ్యక్షుడు, విశాఖపట్నం లోక్‌సభ సభ్యుడు ఎం. శ్రీభరత్ అధ్యక్షత వహించారు. ఉపకులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా, అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు చెందిన మొత్తం 1990 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. వీరిలో 1532 మంది అండర్ గ్రాడ్యుయేట్, 372 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్, 86 మంది పీహెచ్.డీ. పరిశోధకులు ఉన్నారు. విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 17 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. బీటెక్‌లో అన్ని విభాగాల్లో టాపర్‌గా నిలిచిన డిగుదాడి ప్రణవ్ రాహుల్ రెండు బంగారు పతకాలను అందుకున్నారు. ఈ సందర్భంగా భారతీయ చేనేత సంప్రదాయాన్ని పరిరక్షించడంలో విశేష సేవలందించిన ప్రముఖ చేనేత కళాకారుడు గజం గోవర్ధన్కు గీతం విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ (డీ.లిట్) ప్రదానం చేసింది. అలాగే పరిశోధన రంగంలో విశేష కృషి చేసిన డాక్టర్ మహ్మద్ అర్షద్ అన్సారీ, ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్రబాబులకు 'బెస్ట్ రీసెర్చర్' అవార్డులు అందజేశారు. రాజమౌళి పట్టభద్రులను ఉద్దేశించి మాట్లాడుతూ, అంకితభావం, కఠోర శ్రమ, నిరంతర అధ్యయనంతోనే విజయాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు. పెద్ద కలలు కనాలని, వాటి సాధన కోసం పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. గీతం అధ్యక్షుడు శ్రీభరత్ మాట్లాడుతూ, పట్టభద్రులు పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. నిరంతరం నేర్చుకుంటూ, వినయంతో వ్యవహరిస్తూ, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు. వార్షిక నివేదికను సమర్పించిన అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు విద్య, పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో గీతం సాధించిన విజయాలను వివరించారు. అనంతరం పట్టభద్రులు నైతిక విలువలు, వృత్తి నైపుణ్యం, దేశ నిర్మాణానికి తమ బాధ్యతను ప్రతిజ్ఞ చేయగా, రిజిస్ట్రార్ డాక్టర్ డి. గుణశేఖరన్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.







